ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

బుధవారం | 08-04- 2026 | సంపుటి: 17, సంచిక: 6, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## డ్రగ్స్ ముఠా గుట్టు రట్టు

**మూడు పోలీస్ స్టేషన్ల సంయుక్త ఆపరేషన్**



- రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం
- ఐదుగురు నిందితులు అదుపులోకి
- నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్స్ సీజ్
- వ్యాపార నష్టాలే డ్రగ్స్ దందాకు కారణం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రజాకలం) :** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు మరో భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించి నగరంలో కలకలం రేపారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది సమన్వయంతో చేపట్టిన జాయింట్ ఆపరేషన్‌లో రూ. 64.35 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడం విశేషం. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ముఠా కొంతకాలంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుప్తంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పక్కా సమాచారంతో ప్లాన్ చేసిన ఈ ఆపరేషన్‌లో నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అదనంగా, నిందితుల వద్ద నుంచి రూ. 50,000 నగదు, ఒక ద్విచక్ర వాహనం, పలు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ మొబైల్ ఫోన్ల ద్వారా డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌పై మరిన్ని వివరాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. ప్రాథమిక విచారణలో బయటపడిన విషయాల ప్రకారం, నిందితులు మొదట వివిధ ప్రైవేట్ ఉద్యోగాల్లో పనిచేసి, అనంతరం టైల్స్ వ్యాపారం ప్రారంభించారు. అయితే ఆ వ్యాపారంలో భారీ నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో డ్రగ్స్ దందాలోకి దిగినట్లు పోలీసులు వెల్లడించారు. ఇక ఈ ముఠా నగరంలో ఎవరికి డ్రగ్స్ సరఫరా చేస్తోంది, వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. నగరంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారని, యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని అధికారులు తెలిపారు.



### జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**అవినీతి ఆరోపణలపై అకస్మాత్తు తనిఖీలు**

**సిబ్బంది ఫోన్లు స్వాధీనం..**

జగిత్యాల్ ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజాకలం) జగిత్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా దాడులు నిర్వహించారు. పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.దాడుల సందర్భంగా కార్యాలయంలో ఉన్న సిబ్బంది ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి సమాచారాన్ని బయటకు పంపకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కార్యాలయంలోని పత్రాలు, ఫైళ్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పట్టణంలో అనుమతుల మంజూరు, నిర్మాణాల అనుమతుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఈ దాడులతో మున్సిపల్ కార్యాలయ సిబ్బందిలో కలకలం రేగింది.

తరువాయి 2వ పేజీలో...



### 200 ఛానెళ్లతో దుష్ప్రచారం!

**బీఆర్ఎస్‌పై ఆరోపణలు గుప్పించిన జూపల్లి**

- -సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శ
- -కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా ఎదుర్కోవాలని పిలుపు
- -ఫీల్డ్‌లో పని చేస్తేనే ఫలితం వస్తుందని సూచన
- -2029 లక్ష్యంగా పార్టీ బలోపేతంపై దృష్టి

2లో

## తెలంగాణ-కేరళ వాగ్వాదం



**అభివృద్ధి అంశంపై సీఎంల మధ్య మాటల యుద్ధం ముదురు**

- కేరళ సీఎం వ్యాఖ్యలకు లేఖతో సమాధానం ఇచ్చిన తెలంగాణ సీఎం
- పాత గణాంకాలతో తెలంగాణ పనితీరును అంచనా వేయొద్దని సవాల్
- రాష్ట్ర వృద్ధి, తలసరి ఆదాయ గణాంకాలు వివరించిన రేవంత్
- పేదరిక నిర్మూలనపై కేరళ ప్రభుత్వాన్ని నిలదీసిన తెలంగాణ సీఎం
- 'తెలంగాణ రైజింగ్' విజన్‌తో ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రజాకలం) :** తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య అభివృద్ధి అంశంపై మొదలైన మాటల యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తరువాయి 2వ పేజీలో...

## హైడ్రా హిట్

**ఐటీ కారిడార్‌లో భారీ ఎన్‌క్రోచ్‌మెంట్‌పై హైడ్రా చర్యలు**

- రూ.1200 కోట్ల ప్రభుత్వ భూమి కాపాడిన అధికారులు
- ఖానామెట్‌లో 8 ఎకరాలకు పైగా భూమి స్వాధీనం
- తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగింపు
- ఆర్‌సీసీ ప్లాంట్‌ను తొలగించిన నిర్మాణ సంస్థ
- ఫెన్సింగ్, బోర్డులతో ప్రభుత్వ భూమిగా గుర్తింపు



## చోర ధీర

**అమెరికా, ఇరాన్ మధ్య సాంకేతిక పోరు**




- రివర్స్ ఇంజినీరింగ్‌పై పెరుగుతున్న టెన్షన్
- సి-130జె విమానాల ధ్వంసం వెనుక వ్యూహం
- కీలక రహస్యాలు లీక్ కాకుండా కఠిన నిర్ణయం
- టెహ్రాన్‌కు టెక్నాలజీ చేరకుండా జాగ్రత్తలు
- యుద్ధరంగంలో సాంకేతిక ఆధిపత్య పోటీ

వాషింగ్టన్, ఏప్రిల్ 07, అమెరికా, ఇరాన్ మధ్య సాంకేతిక ఆధిపత్య పోరు మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఇరాన్ భూభాగంలో దిగిన ఎఫ్-15 యుద్ధ విమానానికి చెందిన పైలట్‌ను రక్షించే ఆపరేషన్ సమయంలో

తరువాయి 2వ పేజీలో...

## పేదలపై పంజా !



**ఉపాధి హామీపై కేంద్రం కత్తి**

- పని దినాల కోతపై తీవ్ర ఆగ్రహం
- నిధుల నిలుపుదలతో గ్రామీణ సంక్షోభం
- బీజేపీ ఎంపీల మౌనం పై ప్రశ్నలు
- మోడీ సర్కార్‌పై కవిత ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రజాకలం) :** ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచి పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదల జీవనాధారమైన ఈ పథకాన్ని లక్ష్యంగా చేసుకుని మోడీ సర్కార్ కుట్రపూరిత చర్యలు చేపడుతోందని ఆరోపించారు. మంగళవారం విడుదల చేసిన వీడియో సందేశంలో ఆమె కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. పేదల బతుకుదెరువు కోసం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని చట్టబద్ధత లేకుండా చేసేలా పేరు మార్చి, ప్రణాళికాబద్ధంగా నిధులను అడ్డుకుంటూ పేదల పొట్ట కొడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధత ఉన్న పథకానికి నిధులు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందని తెలుసుకుని, దానిని ప్రోగ్రామ్‌గా మార్చి బాధ్యత నుంచి తప్పించుకోవాలని కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన అండగా నిలిచిన ఈ పథకాన్ని దెబ్బతీయడం ద్వారా పేదల జీవితాలను

తరువాయి 2వ పేజీలో...

# జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు





మొదటి పేజీ తరువాయి...

పట్టణ ప్రజలు మాత్రం ఈ చర్యలను స్వాగతిస్తూ, అవినీతి నిర్మూలనకు ఇది మొదటి అడుగు కావాలని అభిప్రాయపడుతున్నారు.

**మున్సిపాలిటీలో నిర్వాహక లోపాలు బహిర్గతం**

మున్సిపల్ పరిపాలనలో వ్యవస్థాగత లోపాలు, ఆదాయ వనరుల నిర్లక్ష్యం వెలుగులోకి వస్తున్నాయి. మంగళవారం ఏసీబీ నిర్వహించిన విస్తృత తనిఖీలు కేవలం అవకతవకలకే కాకుండా, మున్సిపాలిటీ పనితీరులో ఉన్న బలహీనతలను కూడా స్పష్టంగా బయటపెట్టాయి. పది గంటలపాటు సాగిన ఈ తనిఖీల్లో రికార్డుల నిర్వహణ నుంచి ఆదాయ సేకరణ వరకు అనేక కీలక అంశాల్లో లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.14 కోట్ల ప్రాపర్టీ టాక్స్ లక్ష్యానికి కేవలం సగం వసూళ్లు మాత్రమే జరగడం ఆదాయ నిర్వహణలో వైఫల్యాన్ని సూచిస్తోంది. కమర్షియల్, యాడ్వర్టైజ్‌మెంట్ టాక్స్‌ల వసూళ్లు పూర్తిగా తగ్గిపోవడం, గతంలో వచ్చిన ఆదాయం ఈ ఏడాది కనిపించకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఇదే సమయంలో మున్సిపల్ ఆస్తుల పర్యవేక్షణలోనూ నిర్లక్ష్యం బయటపడింది. నాలుగు ఆటోలు, ఒక ట్రాక్టర్ గల్లంతైనా ఇప్పటివరకు చర్యలు లేకపోవడం గమనార్హం. అద్దె భవనాలకు దాదాపు 18 ఏళ్లుగా రీ-టెండరింగ్ జరగకపోవడం, వాహనాల రిపేర్, డీజిల్ ఖర్చుల లెక్కల్లో స్పష్టత లేకపోవడం పరిపాలనలో పారదర్శకత లోపాన్ని చూపిస్తోంది. ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ పర్మిషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఫాగింగ్, సానిటేషన్ పనులకు సంబంధించిన రికార్డులు సరిగా నిర్వహించకపోవడం, కొనుగోళ్లకు జీఎస్టీ బిల్లులు లేకపోవడం ఆర్థిక క్రమశిక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అత్యంత కీలకంగా, కొందరు అధికారుల యూపీఐ లావాదేవీలపై ఏసీబీ దృష్టి సారించడం, అధికార వ్యవహారాల్లో వ్యక్తిగత ఆర్థిక లావాదేవీల పాత్రపై అనుమానాలు పెంచుతోంది. బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయకపోవడం కూడా అధికారుల హాజరు, పనితీరుపై సందేహాలు రేకెత్తిస్తోంది.

# తెలంగాణ-కేరళ వాగ్వాదం

మొదటి పేజీ తరువాయి...

ఘాటుగా స్పందిస్తూ ఒక బహిరంగ లేఖ రాశారు. తాను గౌరవప్రదంగా విమర్శలు చేసినప్పటికీ విజయన్ మాత్రం అమర్యాదకరమైన భాషను ఉపయోగించారని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. "మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను" అంటూ చురకలు అంటిస్తూ, కేరళ సీఎం తెలంగాణకు వచ్చినప్పుడు అతిథిగా పూర్తి గౌరవం ఇస్తానని తెలిపారు. ఇదే తన చివరి స్పందన అంటూ ఆ లేఖను ఎక్స్‌లో పంచుకున్నారు. తెలంగాణ ప్రస్తుత పనితీరుపై తీర్పు ఇవ్వడానికి నీతి ఆయోగ్ 2023-24 సుస్థిర అభివృద్ధి సూచీని పినరయి విజయన్ ఉటంకించడాన్ని రేవంత్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సూచీ పాత ప్రభుత్వ కాలాన్ని ప్రతిబింబిస్తుందని, 2023 డిసెంబరులో ఆ పాలన ముగిసిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పనితీరును తాజా గణాంకాలతో అంచనా వేయాలని ఆయన సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి వివరించిన గణాంకాల ప్రకారం, 2024--25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.16.12 లక్షల కోట్లకు చేరగా రాష్ట్ర వృద్ధి రేటు 10.1 శాతంగా నమోదైంది. జాతీయ సగటు 9.9 శాతం కంటే ఇది ఎక్కువని తెలిపారు. ఆర్బీఐ గణాంకాల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.87 లక్షలకు పెరిగిందని, ఈ విషయంలో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రతో పాటు కేరళను కూడా తెలంగాణ అధిగమించిందని ఆయన పేర్కొన్నారు. కేరళ సాధించిన అభివృద్ధి గత కొన్ని దశాబ్దాల కృషి ఫలితమని అంగీకరిస్తూనే, ముఖ్యంగా విజయన్ హయాంలో జరిగిన మార్పులను అక్కడి ప్రజలకు వివరించాలని రేవంత్ సూచించారు. 2025 చివరి నాటికి కేరళలో తీవ్ర పేదరికం పూర్తిగా నిర్మూలించబడుతుందని విజయన్ చేసిన ప్రకటనపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

ప్రస్తుతం ఇంకా వేల కుటుంబాలకు మైక్రో ప్లాన్‌లు అందుతున్నాయని చెబుతుండగా, పేదరికం నిజంగా నిర్మూలించబడిందా అని ప్రశ్నించారు. అవినీతి అంశంపై కూడా రేవంత్ రెడ్డి కేరళ ప్రభుత్వాన్ని నిలదీశారు. కేరళ నిజంగా అవినీతి రహిత రాష్ట్రం అయితే గోల్డ్ స్మగ్లింగ్ కేసు ఎందుకు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. అలాగే శబరిమల అయ్యప్ప టెంపుల్ నుంచి మాయమైనట్లు ఆరోపణలున్న 4.5 కిలోల బంగారం విషయాన్ని కూడా గుర్తుచేశారు.

తమ ప్రభుత్వ దార్శనికతను వివరిస్తూ 'తెలంగాణ రైజింగ్' లక్ష్యంతో రాష్ట్రాన్ని దశాబ్దంలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ', అలాగే జహీరాబాద్ వద్ద నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి ద్వారా రాష్ట్ర ఆర్థిక ప్రగతిని వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. కేరళలో రాబోయే ప్రభుత్వం 'నవ కేరళం' లక్ష్యాలను అమలు చేస్తుందని తాను విశ్వసిస్తున్నానని కూడా వ్యాఖ్యానించారు.

# చోర ధీర

మొదటి పేజీ తరువాయి...

అమెరికా బలగాలు అసాధారణ నిర్ణయం తీసుకున్నాయి. ఈ చర్యలో భాగంగా దెబ్బతిన్న రెండు సి-130జె రవాణా విమానాలను స్వయంగా ధ్వంసం చేయడం గమనార్హం. ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశ్యం రివర్స్ ఇంజినీరింగ్‌కు అడ్డుకట్ట వేయడమే. ఆధునిక యుద్ధ సాంకేతికతలో కీలకమైన విమాన భాగాలు, ఎలక్ట్రానిక్ వ్యవస్థలు శత్రుదేశం చేతికి చిక్కితే, వాటిని అధ్యయనం చేసి అదే తరహా సాంకేతికతను అభివృద్ధి చేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఇరాన్ చేతికి అమెరికా సాంకేతిక రహస్యాలు చిక్కకుండా ఉండేందుకు ఈ చర్యకు పాల్పడ్డట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సూపర్ పవర్ దేశాలు తమ సాంకేతిక ఆధిపత్యాన్ని కాపాడుకోవడంలో ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనుకాడవని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. యుద్ధరంగంలో గెలుపు కేవలం ఆయుధ శక్తిపైనే కాకుండా, సాంకేతిక రహస్యాల రక్షణపైనా ఆధారపడి ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఇరాన్ కూడా రివర్స్ ఇంజినీరింగ్‌లో దిట్టగా ఎదుగుతూ ఉండటం అమెరికాకు ఆందోళన కలిగిస్తోంది. గతంలో పలు ఆధునిక డ్రోన్లు, ఆయుధ వ్యవస్థలను ఇరాన్ పరిశీలించి తమ సాంకేతికతను అభివృద్ధి చేసిన ఉదాహరణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజా ఘటన రెండు దేశాల మధ్య టెక్నాలజీ యుద్ధం మరింత ముదిరే సూచనలను ఇస్తోంది.

# హైడ్రా హిట్

**ఐటీ కారిడార్‌లో భారీ ఎన్‌క్రోచ్‌మెంట్‌పై హైడ్రా చర్యలు**
**రూ.1200 కోట్ల ప్రభుత్వ భూమి కాపాడిన అధికారులు**
**ఖానామెట్‌లో 8 ఎకరాలకు పైగా భూమి స్వాధీనం**
**తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగింపు**
**ఆర్‌సీసీ ప్లాంట్‌ను తొలగించిన నిర్మాణ సంస్థ**
**ఫెన్సింగ్, బోర్డులతో ప్రభుత్వ భూమిగా గుర్తింపు**



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రజాకలం) : హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలో హైడ్రా అధికారులు భారీ ఆపరేషన్ నిర్వహించి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్ 55లో ఉన్న 8 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.1200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల మేరకు హైడ్రా అధికారులు సంబంధిత శాఖలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టి, ఈ భూమి ప్రభుత్వానికి చెందిందని నిర్ధారించారు. వెంటనే చర్యలు చేపట్టి అక్కడ ఏర్పాటుచేసిన తాత్కాలిక షెడ్లు, కార్మికుల నివాసాలు, నిర్మాణ సామగ్రిని తొలగించారు. అదేవిధంగా అక్కడ పనిచేస్తున్న ఆర్‌సీసీ ప్లాంట్‌ను కూడా నిర్మాణ సంస్థ తొలగించాల్సి వచ్చింది. ఈ భూమిపై కొన్ని ప్రైవేట్ సంస్థలు హక్కులు చెప్పుకున్నప్పటికీ, రెవెన్యూ రికార్డులు పరిశీలనలో ఇది ప్రభుత్వ భూమేనని స్పష్టమైంది. దాంతో అధికారులు ఆక్రమణలను పూర్తిగా తొలగించి భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి "ప్రభుత్వ భూమి" అని బోర్డులు పెట్టి భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇటీవలి కాలంలో నగర పరిధిలో హైడ్రా అక్రమ భూకబ్జాలపై కఠిన చర్యలు తీసుకుంటూ కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తోంది. ఈ తాజా ఆపరేషన్ కూడా అదే దిశగా సాగి, ఐటీ కారిడార్ ప్రాంతంలో ప్రభుత్వ భూముల సంరక్షణకు కీలకంగా మారింది.

# 200 ఛానెళ్లతో దుష్ప్రచారం!

**బీఆర్ఎస్‌పై ఆరోపణలు గుప్పిచ్చిన జూపల్లి - సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శ**
**-కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా ఎదుర్కోవాలని పిలుపు -ఫీల్డ్‌లో పని చేస్తేనే ఫలితం వస్తుందని సూచన**
**-2029 లక్ష్యంగా పార్టీ బలోపేతంపై దృష్టి**



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రజాకలం) : రాష్ట్ర రాజకీయాల్లో సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారాలపై మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో స్పందించారు. అక్రమంగా సంపాదించిన వేల కోట్ల రూపాయలను వినియోగించి బీఆర్ఎస్ పార్టీ దాదాపు 200 యూట్యూబ్ ఛానెళ్లను కొనుగోలు చేసి, ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు నిర్వహిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేలా సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రత్యేకంగా యూట్యూబ్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రభుత్వంపై నెగటివ్ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిర్లక్ష్యం వహించకుండా, ఈ దుష్ప్రచారాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మాత్రమే ఈ తప్పుడు ప్రచారాలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. కేవలం ఇంట్లో కూర్చొని రాజకీయాలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పనిచేయాలని ఆయన సూచించారు. "మంత్రాలకు చింతకాయలు రాలవు" అనే సామెతను ఉదహరిస్తూ, కృషి లేకుండా ఫలితాలు సాధ్యం కావని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త తన బాధ్యతగా భావించి గ్రామాలు, పట్టణాల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అదేవిధంగా, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 2029 నాటికి రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త రోజుకు కనీసం ఒక గంట సమయం కేటాయించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తేనే ప్రజల విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. మొత్తానికి, సోషల్ మీడియా ప్రచారాలపై తీవ్ర విమర్శలు చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ శ్రేణులు మరింత చురుకుగా పనిచేసి ప్రజల్లో నిజాలను విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ నాయకుల హౌస్ అరెస్టుపై కేటీఆర్ అగ్రహం

హైదరాబాద్, ఏప్రిల్ 07: బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు.

గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పేదలపై పంజా!

మొదటి పేజీ తరువాయి...

సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని కవిత అన్నారు. తెలంగాణలో 2021-22లో 14 కోట్ల పని దినాలు కల్పించగా, గతేడాది వాటిని సగానికి తగ్గించి 7 కోట్లకు పరిమితం చేయడం పేదలపై నేరమని మండిపడ్డారు. పని దినాల కోతతో పాటు నిధుల కొరత కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇక ఉపాధి హామీ పనులను నిర్వహించే ఫీల్డ్ అసిస్టెంట్ల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేసి, కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. వెంటనే వారికి ఉద్యోగ భద్రత కల్పించి, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు నమ్మకంతో గెలిపించిన బీజేపీ ఎంపీలు ఈ విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని కవిత నిలదీశారు. పేదల నోటికాడి కూడు లాగేస్తున్న కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం కూడా చూపకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వంతో పోరాడి, రాష్ట్రానికి రావాల్సిన ఉపాధి హామీ నిధులను తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. కరువు, సంక్షోభ సమయంలో గ్రామీణ పేదలకు అండగా నిలిచిన ఈ పథకాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కవిత పిలుపునిచ్చారు. పేదల హక్కులను కాపాడే పోరాటంలో ప్రజలంతా ముందుకు రావాలని ఆమె కోరారు.

# హరీశ్ ఫైర్

**-పరిగి ఘటనలో అరెస్టులు -రేవంత్‌పై ఎద్దేవా**
**-ప్రజాస్వామ్యం ఖూనీ ఆరోపణ**
**-ప్రతిపక్షాలపై అణచివేత? -కేసీఆర్ రాజ్యం హామీ**



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రజాకలం) : ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలవలేదని, సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. పరిగి ఇండస్ట్రియల్ పార్క్ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న సమయంలో పోలీసులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకుని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు, తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందనే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. ఆయన ఆశలు పగటి కలలేనని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కదని అన్నారు. గత రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆరోపించిన ఆయన, ప్రతిపక్షాలు ప్రశ్నించకుండా అణచివేత చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఆందోళనలు, ధర్నాలు నిర్వహించకుండా నిరోధిస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరగా, వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో రామరాజ్యం స్థాపన అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## అజాగ్రత్తగా వాహనాలు నడిపి

# ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

**- తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి**




ములుగు, ఏప్రిల్ 7 : అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలో అరీవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దని వాహనదారులకు సూచించారు. కారు బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల వారే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం పామునూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ శివధర్ రెడ్డి, ఐబీ చీఫ్ సుమతి, ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణం జరగాలని చెప్పుకొచ్చారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఇంత త్వరగా రోడ్లు వేయడం అభినందనీయమని అన్నారు. రోడ్లు వేయడంతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా
# భూసార మట్టి పరీక్షల నమూనాల సేకరణ




ఎండపల్లి, ఏప్రిల్ 07 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో మంగళవారం రోజున ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా గుల్లకోట గ్రామ పంచాయతీ ఆవరణ లో వ్యవసాయ విస్తరణ అధికారి సుత్రపు లావణ్య ఆధ్వర్యం లో భూసార మట్టి పరీక్షల నమూనాల సేకరణ కు ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ రెవెన్యూ గ్రామంలో వ్యవసాయ శాఖ పరిధిలో 5 భూసార పరీక్ష నమూనాలు సేకరించడం జరిగిందని వ్యవసాయ విస్తరణ అధికారి సుత్రపు లావణ్య తెలిపారు. గ్రామం తరుపున మట్టి పరీక్ష కోసం మట్టి సేకరించి కరీంనగర్ సాయి టెస్టింగ్ ల్యాబ్ (ఎస్ టి ఎల్ ) కు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి సుత్రపు లావణ్య, గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, వార్డ్ సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# కిషన్ రావుపేట్ గ్రామంలో పలు కుటుంబాల పరామర్శ

## - పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు ఎండపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి



ఎండపల్లి, వెల్గటూర్ ఏప్రిల్ 07 : (ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం కిషన్ రావుపేట్ గ్రామం లో వాళ్ళ కుటుంబాల పరామర్శ ఈ మధ్య మృతిచెందిన అన్నమ నేని ధర్మారావు, కల్లు అంకయ్య, గుమ్మడి వెంకటేష్ కుటుంబాలను మంగళవారం రోజున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎండపల్లి మాజీ సింగిల్ విండో చైర్మెన్ మద్దుల గోపాల్ రెడ్డి వాళ్ళ కుటుంబాలను పరామర్శించారు. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోవడం చాలా బాధాకరమని వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. గుమ్మడి వెంకటేష్ కుటుంబ ఆర్థిక పరిస్థితుల గురించి తెలుసుకుని చలించి తక్షణమే 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం లో మండలంలోని పలు గ్రామాల సర్పంచు లు కిషన్ రావుపేట్ సర్పంచ్ కుమ్మరి సునీత-వెంకటేష్, కందికట్ల అమృత-రాజేష్, పడిధం లావణ్య-మొగిలి, బెడ్డల ప్రవీణ్, కోటిలింగాల ఆలయ ఛైర్మెన్ పూదరి రమేష్, మేరుగు నరేష్, నీలం శ్రీనివాస్, గూడ రామ్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, వినోద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హమాలీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

## మండుటెండలో పని చేయవద్దు - ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజాకలం) వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వ్యవసాయ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ మంగళవారం హమాలీ, జాడు, దడువాయి రైతులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఎండ కాలం దృష్ట్యా ఎండలో పని చేస్తూ ఉన్న హమాలి, జాడు, కార్మికులు అలాగే అమ్మకానికి వచ్చిన రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పుల్లూరు నవీన్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, ఆపరేటర్ సతీశ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి సేవలు ప్రశంసనీయం : మెట్ పల్లి ఎస్సై కిరణ్

## ఓం శ్రీ సాయిరాం చలివేంద్రం ప్రారంభోత్సవం

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజా కలం) శ్రీ సత్యసాయి సేవలు ప్రశంసనీయమని మెట్ పల్లి ఎస్సై కిరణ్ పేర్కొన్నారు. మెట్ పల్లి శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో మెట్ పల్లి క్రొత్త బస్టాండ్ ఆవరణలో మంగళవారం చలివేంద్రాన్ని మెట్ పల్లి ఎస్సై కిరణ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి సేవా సమితి నిర్వహిస్తున్న సేవలను అభినందిస్తూ చలివేంద్రం ద్వారా ప్రయాణికులకు, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం చాలా గొప్ప సేవగా కొనియాడారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు ర్యాగల్ల వెలయేశ్వర్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సేవా సంస్థ ద్వారా మండు వేసవిలో చల్లని ఫిల్టర్ త్రాగునీరు దాదాపు రోజుకు 1000 నుండి 1500 లీటర్ల వరకు అందించబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీనివాస్, లక్ష్మణ్ గౌడ్, శేష షయన, లింబాద్రి, భూమేశ్వర్, ప్రవీణ్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.




## మక్కల కొనుగోలు కేంద్రాలను
# సద్వినియోగం చేసుకోవాలి

## - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగి, ఏప్రిల్ 07, (ప్రజాకలం ప్రతినిధి)

రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాలను సద్వినయోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ఏఎంసీ పరిధిలోని డిసిఎంఎస్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. ప్రభుత్వ మద్దతు ధర 2400ల రూపాయలు నిర్ణయిం చిందని, రైతులకు అండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని అందుకే రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కలిపిస్తూ ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తున్నామని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా ఇచ్చామని అలాగే రైతు రుణమాఫీ చేశామని, వ్యాసాయానికి కావలసిన పనిముట్లను కూడా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. సాగునీటికి ఎల్లంపల్లి నీళ్లు కూడా అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ పుష్పలత, ఎస్ఐ మోతీరాం, మార్కెట్ చైర్మన్ చెలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, మాజీ జడ్పిటిసి గట్ల మీనయ్య,గడ్డం శ్రీనివాస్ నాయకులు ఎర్రంగంగానర్సయ్య, తర్రె లింగం, పల్లిగంగాధర్,గడ్డం స్వామి, కేసిరెడ్డి నర్సారెడ్డి, సనుగుల గంగాధర్, అక్కినపెల్లి శ్రీనివాస్, కట్కూరి దాసు, ఎర్రం రాజలింగం మరియు వార్డు మెంబర్లు, అధికారులు, మార్కెట్ డైరెక్టర్లు నాయకులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

## సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ - ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జగ్గాసాగర్ పీహెచ్‌సీ సిబ్బందికి సత్కారం



మెట్ పల్లి కోరుట్ల ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజాకలం) వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని జగ్గాసాగర్ సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ పేర్కొన్నారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జగ్గాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలకు సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ సన్మానించి సత్కరించారు. గ్రామ ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నందుకు పీహెచ్‌సీ సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ వైద్యురాలుగా డాక్టర్ తాటిపర్తి శివాని ని సత్కరించి, ఉత్తమ సేవలు అందిస్తున్న ఏఎన్ఎం ఎన్. ప్రియదర్శిని కి పురస్కారం అందజేశారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలకు గాను ఆశా కార్యకర్తలకు కూడా అవార్డులు ప్రదానం చేశారు. రంగారావుపేటకు చెందిన సిలువేరి మమత, కొండ్రికార్ల గ్రామానికి చెందిన చిలువేరి రేఖ, ఉత్తమ ఆశా కార్యకర్తలుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుల్ల సాయి గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పీహెచ్‌సీ సిబ్బంది చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఎల్లాల అంజిత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్,11వ వార్డు సభ్యులు రాజేశం,పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ ప్రజలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు అందజేయడం పట్ల సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

# జగదేవుపేట బీఆర్ఎస్ గ్రామ శాఖ నూతన అధ్యక్షుడిగా ఎర గోకుల శశికుమార్

ఎండపల్లి, వెల్గటూర్ ఏప్రిల్ 07 : ( ప్రజా కలం ప్రతినిధి )

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు వెల్గటూర్ మండలం జగదేవుపేట గ్రామం లో భారస నూతన కమిటి ని మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్ అధ్యక్షతన గ్రామ శాఖ అధ్యక్షులు గా ఎర గోకుల శశికుమార్ ను ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా పత్తిపాక వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రం నిరంకుశ పాలన సాగుతోందని, ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, కేవలం వారి అభివృద్ధి కోసమే అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, రాబోయే కాలం లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన ప్రతిఫలం అందిస్తారని, 2029 ఎన్నికల్లో తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉంటా రని ఆయన తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు బాధ్యత గా ఉండలని కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండ గట్టాలని సూచించారు. ఈ కార్య క్రమం లో కొప్పుల సురేష్, రంగు తిరుపతి, బాలసాని సత్యం, మేరుగు అశోక్, ఉపసర్పంచ్ కొర్రి గంగయ్య, మాజీసర్పంచ్ గాగిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కోటగిరి తిరుపతి, కొనింటి గంగయ్య, సొంతపురి లక్ష్మణ్, ద్యావనపెల్లి రవి, కూనమల్ల లక్ష్మణ్, గడ్డం మల్లారెడ్డి, ఎండి దస్తగిరి, కొర్రి ఎల్లయ్య, ఆసాది అశోక్, మిట్ట శ్రీనివాస్, సలాది ఆశీర్వాదం, గడ్డం లచ్చిరెడ్డి, బద్దం మాధవ రెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డి, కొర్రి సతీష్, క్యాతం సుధాకర్, సింగిరెడ్డి బాపురెడ్డి, క్యాతం దేవదాస్, క్యాతం పద్మయ్య, క్యాతం రవి, లక్కాకుల వేణు గోపాల్, బచ్చల నరసయ్య, క్యాతం చింటు, సలాది మహేష్, బొడ్డు నరేష్, సలాది రఘు, గూపెల్లి రాజేశం, క్యాతం రాజు, క్యాతం శ్రీమాన్, ఎడ్ల సంసోన్, సొంత పూరి పవన్, ఎర్ర గోకుల కీర్తి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## కారు యాక్సిడెంట్ లో చికిత్స
# పొందుతున్న నారాయణరావు బ్రెయిన్ డెడ్

## - బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాల దానం
## - జీవన్ దాన్ సంస్థకు దానం చేసిన కుటుంబ సభ్యులు
## - ముగ్గురు వ్యక్తులకు అవయవాలను అమర్చి పునర్జన్మ ను ప్రసాదించిన వైద్యులు

ఎండపల్లి, ఏప్రిల్ 07 : ( ప్రజా కలం ప్రతినిధి )



జగిత్యాల జిల్లా నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన మాసిపెద్ది నారాయణరావు తన ఇంటి నుండి తేదీ 02.04.2026 గురువారం రోజున సాయంత్రం 4-40 నిమిషాలకు ఇంటి నుండి పొలం వద్దకు వెళుతుండగా అంబారీపేట స్టేజి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొని తలకు తీవ్ర గాయాలై నందున అట్టి వ్యక్తిని కరీంనగర్ అపోలో ఆసుపత్రి లో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతున్న వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినదని హాస్పిటల్ వైద్యులు తెలియజే యగా వారి కుటుంబ సభ్యులైన భార్య రాణి, కుమారులు రఘుపతిరావు, రాకేష్ రావు కుటుంబ సభ్యుల అంగీకారం వల్ల జీవన్ దాన్ సంస్థ కు నారాయణ రావు ఆర్గాన్స్ డొనేషన్ చేయుటకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యుల అంగీకారంతో నారాయణరావు అవయవాలను దానం చేయుటకు హైదరాబాదు జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్ వైద్య బృందం అవయవాలను తీసిన వైద్యులు సేకరించిన రెండు కిడ్నీలు, లివర్ (కాలేయం) అవయవాలను సేకరించారు. అవయవాల కోసం ముగ్గురు వ్యక్తులు నిరీక్షిస్తున్న సమయం లో ముగ్గురు బాధితులకు నారాయణ రావు అవయవాలను ముగ్గురు వ్యక్తులకు అమర్చి వారికి వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. బ్రెయిన్ డెడ్ అయిన నారాయణరావు కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి అభినందించారు.

# ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం

## ముఖ్య అతిథులుగా ఏఎంఓ డాక్టర్ పిఎం షేక్, ఎంఈఓ పోతు ప్రభాకర్



ఎండపల్లి, ధర్మారం ఏప్రిల్ 07 : ( ప్రజా కలం ప్రతినిధి )ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండలం చింతలపల్లి గ్రామం లోనీ ప్రాథమిక పాఠశాల లో వార్షికోత్సవం ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు గా ఏఎంఓ డాక్టర్ పిఎం షేక్, మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ హాజరు అయ్యారు. వారు మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ఈ కార్యక్రమం చేయడం మంచి విషయమని తల్లితండ్రులు అందరూ చింతలపల్లి గ్రామం లోనీ ప్రాథమిక పాఠశాల కు తమ తమ పిల్లలను పంపించగలరు అని చెప్పారు. ధర్మారం మండలం లో ప్రీ ప్రైమరీ పాఠశాల చింతలపల్లి ఒకటే ఉన్నందున తల్లితండ్రులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సూర రజిత వెంకటేశం, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రకాష్, వార్డు సభ్యులు, లత, శంకరమ్మ, కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ప్రీ ప్రైమరీ టీచర్ కే స్రవంతి, ఆయా కె వెన్నెల, ఏ ఏ పీ సి చైర్మన్ బి విజయ, విద్యార్థుల తల్లి తండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

హైదరాబాద్ : బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కళింగ కల్చరల్ సెంటర్లో ఏర్పాటుచేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను నగర సోషలైట్ పల్లవి ఠాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ చేనేతకారులు ప్రదర్శించిన వస్త్ర ఉత్పత్తులను ఆమె తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగే ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీ రియల్ వంటి 74 వేల రకాల వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉంచారని వివరించారు.

# ప్రజావాణి ద్వారా నేరుగా సమస్యల పరిష్కారం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ఏప్రిల్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రజల సమస్యల పరిష్కారానికి ఎటువంటి మధ్యవర్తులు అవసరం లేదని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవలు అందించే పేరుతో కొంతమంది మధ్యవర్తులు మోసాలకు పాల్పడుతున్నట్లు గమనించామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కొందరు వ్యక్తులు భూ భారతి సమస్యలు పరిష్కరిస్తామని, ఇందిరమ్మ ఇండ్లు,కొత్త రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ పథకాలలో ఎంపిక చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇలాంటి వ్యక్తులకు ఎటువంటి అధికారిక గుర్తింపు లేదని,వారు ప్రజలను మోసం చేస్తున్నారని స్పష్టం చేశారు.ఎవరైనా సమస్య పరిష్కారం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే ఒక్క పైసా కూడా ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.ప్రజలు తమ సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా జిల్లా కలెక్టర్ లేదా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు.అలాగే బుధవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కలెక్టర్ ప్రజలను కలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మధ్యవర్తులను నమ్మి డబ్బులు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

**జాబ్ మేళాతో ఉజ్వల భవిష్యత్తు**

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మెగా జాబ్ మేళా కీలకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మెగా జాబ్ మేళా నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా మెగా జాబ్ మేళాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి టాస్క్,డీఈఈటీ,జిల్లా ఉపాధి కార్యాలయ అధికారులు సమన్వయంతో పని చేసి జాబ్ మేళాలను నిర్వహించాలని సూచించారు. మే1 నుండి 13 వరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన కేంద్రాలలో జాబ్ మేళాలను నిర్వహించాలని,మే 14 నుండి 24 వరకు ఇతర ప్రాంతాలలో మెగా జాబ్ మేళాలను నిర్వహించాలని తెలిపారు.మే 25 లేదా 26న ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ లేదా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేయాలని పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో మెగా జాబ్ మేళా నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని అధికారులకు ఆదేశించారు.కార్యక్రమం నిర్వహణ స్థలం,పాల్గొనే సంస్థల సంఖ్య,కల్పించనున్న ఉద్యోగ అవకాశాలు,అభ్యర్థుల సౌకర్యాలు వంటి ప్రతి అంశాన్ని సూక్ష్మంగా ప్రణాళిక చేయాలని సూచించారు.టాస్క్,ఇతర శిక్షణ కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతకు సరైన శిక్షణ అందించి,జాబ్ మేళాలో పాల్గొనేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాలని తెలిపారు.మంచి ఉపాధి అవకాశాలను పొందేందుకు యువతను సిద్ధం చేయడం ముఖ్యమని పేర్కొన్నారు.టాస్క్ ప్రాంతీయ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు నిరంతరం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ,నైపుణ్యాలతో పాటు అవసరమైన ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.యువత టాస్క్ వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని సూచించారు.అలాగే జిల్లా లోని అన్ని డిగ్రీ,ప్రొఫెషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు.ప్రస్తుత విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులను కూడా సంప్రదించి, జాబ్ మేళా ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని,అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు,జిల్లా పరిశ్రమల అధికారి,కీర్తి కాంత్,టాస్క్ సెంటర్ అధికారి కౌసల్య, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా కలం

బుధవారం, ఏప్రిల్ 8, 2026

# యుద్ధం ఆగేదెలా...

అటు ఇరాన్, ఇటు అమెరికా రెండు దేశాలు ఎక్కడ తగ్గడం లేదు... ఎవరికి వారు పై చేయి అని చూపించుకొనేందుకు కష్టపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో యుద్ధం ఆగేదెలా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. మేం విధించిన డెడ్ లైన్ లోగా హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అయితే హోర్ముజ్‌ను తెరవడానికి.. దాని ద్వారా వచ్చే ఆదాయంలో కొంత వాటాను తమ దేశానికి ఇవ్వాలని ఇరాన్ కొత్త కండీషన్ పెట్టింది. తమను నాశనం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని.. ఎర్ర సముద్రంలోని మరో కీలక జలసంధిని కూడా టార్గెట్ చేస్తామని వార్నింగ్ ఇచ్చింది. ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతోన్న యుద్ధం నెక్స్ట్ లెవల్‌కు వెళ్లే సూచనలు కనిపిస్తు?న్నాయి. హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పంతానికి పోతున్నాయి. ఈ జలసంధిని తెరవడానికి గడువు దగ్గరపడుతోందని.. ఆ టైంలోగా తెరవకపోతే మీ అంతు చూస్తామని ఓవైపు ట్రంప్ హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్ సైతం తగ్గేదేలే అన్నట్టుగా బదులిస్తుంది. అమెరికా బెదిరింపులను టెహ్రాన్ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గల్ఫ్ యుద్ధం తారా స్థాయికి చేరుకుంటుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. హోర్మూజ్ జలసంధిని తెరవకపోతే మంగళవారం ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులో బూతులతో ఆయన రెచ్చిపోయారు. ట్రంప్ హెచ్చరికల పట్ల ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబఫ్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అలాంటి చర్యలు తీసుకుంటే.. అమెరికాతోపాటు పశ్చిమాసియా దేశాలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఘలిబఫ్ హెచ్చరించారు. ట్రంప్ ఉద్రిక్తతలు పెంచుతున్నారని.. అస్థిరతలోకి నెట్టేస్తున్నారని.. ఆయన నిర్లక్ష్యంగా అడుగులేస్తున్నారని.. ఇవన్నీ కలిసి అమెరికా పరిస్థితి నరకంలా మారుతోందని ఘలిబఫ్ ఎక్స్‌లో చేసిన పోస్టులో ఆరోపించారు. ఇజ్రాయెల్ ప్రయోజనాలకు అనుగుణంగానే పశ్చిమాసియాలో అమెరికా చర్యలు ఉటున్నాయని.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాటలు విని గల్ఫ్ ప్రాంతాన్ని ట్రంప్ తగలబెడుతున్నారని ఘలిబఫ్ మండిపడ్డారు. యుద్ధ నేరాల ద్వారా ట్రంప్ సాధించేది ఏమీ లేదని.. ఇరాన్ ప్రజల హక్కులను గౌరవించి.. ప్రమాదకరమైన యుద్ధాన్ని ముగించడమే ఈ సమస్య ఏకైక పరిష్కారమని ఇరాన్ నేత తన పోస్టులో పేర్కొన్నారు. హోర్ముజ్‌ను తిరిగి తెరవడానికి టెహ్రాన్ ఓ కొత్త షరతును విధించింది. యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారంగా.. హోర్ముజ్ మార్గం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ఇరాన్‌కు కేటాయిస్తేనే.. ఈ జలసంధి గుండా రవాణాకు అనుమతి ఇస్తామని ఇరాన్ అధ్యక్షుడి అధికార ప్రతినిధి సయ్యద్ మహ్మద్ మెహదీ తబాతబెయ్ స్పష్టం చేశారు. అమెరికా మూర్ఖంగా మళ్లీ అవే తప్పులు చేసే ఆలోచనలో ఉన్నట్లయితే.. ప్రపంచదేశాలకు వెళ్లే చమురు, గ్యాస్ సరఫరాను.. వాణిజ్యాన్ని ఒకే ఒక సిగ్నల్‌తో స్తంభింపజేయవచ్చని వారు గ్రహిస్తారు అని ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీకి విదేశాంగ సలహాదారుగా పని చేసిన అలీ అక్బర్ వెలాయటి హెచ్చరించారు. తమ రెసిస్టెంట్ ఫ్రంట్ ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్ మాండేబ్ జలసంధిని టార్గెట్ చేయొచ్చని ఆయన వార్నింగ్ ఇచ్చారు. ప్రపంచ వాణిజ్యంలో 12 శాతం బాబ్ ఎల్ మాండేబ్ జలసంధి ద్వారా జరుగుతోంది. గతంలో ఈ జలసంధిని యెమెన్‌లోని ఇరాన్ అనుకూల హౌతీ బలగాలు టార్గెట్ చేశాయి. ఇప్పటికే హోర్ముజ్ గుండా రవాణా దాదాపుగా నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ ధరలు పెరిగాయి. బాబ్ ఎల్ మాండేబ్ ద్వారా నౌకల రాకపోకలు కూడా నిలిచిపోతే దాని ప్రభావం ప్రపంచ దేశాలపై మరింత తీవ్రంగా ఉంటుంది. పశ్చిమాసియా యుద్ధంలో అమెరికాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా వైమానిక దళానికి చెందిన రెండు సీ–130 విమానాలను కూల్చేసినట్లు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఇస్ఫహాన్ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు సీ–130 విమానాలు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లను కూల్చేసినట్లు ఇరాన్ సైన్యం వెల్లడించింది. అమెరికాకు చెందిన ఈ–15ఇ ఫైటర్ జెట్ కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అమెరికాకు చెందిన ఓ పైలెట్ గల్లంతు కాగా.. ఆ పైలట్ కోసం అమెరికా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించింది. ఈ రెస్క్యూ ఆపరేషన్ కోసం దక్షిణ ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లోని ఓ మూతపడిన విమానాశ్రయాన్ని అమెరికా ఉపయోగించుకుందని ఇరాన్ సైన్యం వెల్లడించింది. పైలట్‌ను రక్షించే నెపంతో, దక్షిణ ఇస్ఫహాన్‌లోని ఒక మూతపడిన విమానాశ్రయంలో మోసపూరితమైన మిషన్‌ను అమెరికా ప్లాన్ చేసిందన్న ఇరాన్ సైన్యం.. ఈ ఆపరేషన్‌ను పూర్తిగా భగ్నం చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఇరాన్ సైన్యం కేంద్ర కమాండ్ ప్రతినిధి ఖతమ్ అల్ అన్బియా ఇబ్రహీం జొల్ఫఘారి అన్నారు. ఈ ఆపరేషన్‌లో రెండు సీ –130 సైనిక రవాణా విమానాలు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు ధ్వంసమైనట్లు తెలిపారు. మరోవైపు గల్లంతైన పైలెట్‌ను గుర్తించేందుకు అమెరికా చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా అనేక ఎగిరే వస్తువులను.. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ధ్వంసం చేసినట్లు ఆ దేశ మీడియా పేర్కొంది. మరోవైపు గల్లంతైన పైలెట్‌ను తమ దళాలు కాపాడినట్లు ట్రంప్ వెల్లడించారు. మరోవైపు.. దక్షిణ లెబనాన్‌లోని కఫర్ హట్టా ప్రాంతంపై ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఏడుగురు చనిపోయారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ఉన్నట్లు లెబనాన్ సివిల్ డిఫెన్స్ విభాగం అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతం ఇజ్రాయెల్ సరిహద్దుకు చాలా దూరంలో ఉందని తెలిపారు.

# ఆరోపణలు అవాస్తవం..స్పందించిన భార్యాభర్తలు

## తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం - పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిక

పెద్దపల్లి,ఏప్రిల్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లిలో ఇటీవల తమపై జరుగుతున్న ఆరోపణలు,బ్యానర్లలో చేసిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని తోడేటి బాపు,సంధ్య తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ తమ కుటుంబ ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. డబ్బుల వ్యవహారంలో కూడా ఒకసారి రూ.34 లక్షలు,మరోసారి రూ.43 లక్షలు అంటూ భిన్నంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మమ్మల్ని, మా కుటుంబాన్ని చెడుగా చూపించేందుకు ఇలా దిగజారి తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్, బంగారం స్కీమ్ పేరుతో మోసం చేశామన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఖండించారు. తమ వద్ద అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయని, నిజాన్ని బయటపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మా పరువు తీసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తోడేటి బాబు,సంధ్య కోరారు. అసత్య ప్రచారం కొనసాగిస్తే పరువు నష్టం దావా వేయడమే కాకుండా, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అలాగే వారు చేసిన తప్పుకు తమ కుటుంబానికి అందరి ముందు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒద్దం చిన్నయ్య, ఒద్దం స్వరూప,కట్ల సరిత,జానకీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## - ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



సుల్తానాబాద్,ఏప్రిల్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,వచ్చే ఎన్నికల నాటికి ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి తీరుతామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు. మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 10వ వార్డు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బీమా తరహాలోనే తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ బీమా సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని,ఈ పథకాన్ని జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం,ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు,సన్న బియ్యం,రుణమాఫీ,ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. అభివృద్ధి విషయంలో సుల్తానాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్ది అద్దంలా మారుస్తానని,ఇప్పటికే కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ,ఆధునీకరణ పనులు చేపట్టామని తెలిపారు. అంబేద్కర్ విగ్రహం నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు నిర్మించిన బీటీ రోడ్డు,డివైడర్,సెంట్రల్ లైటింగ్‌ను త్వరలోనే ప్రారంభిస్తానని చెప్పారు. అయితే, ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు ప్రారంభించకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేస్తూ,అధికారులు ఈ విషయంలో చొరవ చూపాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అంతకుముందు గర్రెపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని,లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత,గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు,కౌన్సిలర్లు,వివిధ శాఖల అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టిక్కర్‌తో గంజాయి దందా

## - నలుగురు స్మగ్లర్లకు 12 ఏళ్ల జైలు..రూ. 2 లక్షల జరిమానా

పెద్దపల్లి,ఏప్రిల్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఏడేళ్ల క్రితం జరిగిన భారీ గంజాయి తరలింపు కేసులో పెద్దపల్లి జిల్లా కోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. అక్రమంగా గంజాయి తరలిస్తూ పట్టుబడిన నలుగురు నిందితులకు 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు,ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున భారీ జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శ్రీమతి సునీత కుంచాల ఉత్తర్వులు జారీ చేశారు. కేసు వివరాల్లోకి వెళ్తే.. 09 ఫిబ్రవరి 2019న సుల్తానాబాద్ చెరువు కట్ట వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా,కరీంనగర్ వైపు నుండి వస్తున్న ఒక మారుతి సుజుకి కారును అడ్డుకున్నారు. నిందితులు పోలీసుల కళ్ళు గప్పేందుకు కారుపై పోలీస్ స్టిక్కర్ తగిలించి అక్రమ రవాణాకు పాల్పడుతుండటం గమనార్హం. అనుమానంతో కారును సోదా చేసిన ఎస్సై పి.దేవేందర్ బృందం, డిక్కీలో 67 కవర్లలో ప్యాక్ చేసి ఉన్న సుమారు 144 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడిన కర్ణాటకకు చెందిన రావ్




గుణాజీ,సయ్యద్ హుసేన్సాబ్,మెదక్ జిల్లాకు చెందిన కేతావత్ మారుతీ,జాదవ్ విజయ్ కుమార్‌లను పోలీసులు అప్పట్లోనే అరెస్ట్ చేశారు. అప్పటి సుల్తానాబాద్ సీఐ మహేందర్ రెడ్డి ఈ కేసులో పటిష్టమైన నేర పరిశోధన చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయగా,పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవి సాక్షులను ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించడంలో కీలక పాత్ర పోషించారు. పోలీసు యంత్రాంగం మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను, సిబ్బందిని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లా ఆసుపత్రికి రాష్ట్రస్థాయి అవార్డుల పంట

## - కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా సర్కారు వైద్యం
## - తెలంగాణలో పెద్దపల్లి ఆసుపత్రి సరికొత్త రికార్డు
## - మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సూపరింటెండెంట్ డా.శ్రీధర్



పెద్దపల్లి,ఏప్రిల్ 07:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవల్లో సరికొత్త రికార్డు సృష్టించింది. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా నాణ్యమైన వైద్యం అందిస్తూ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ గుర్తింపు పొందింది. వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మూడు వేర్వేరు విభాగాల్లో రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికై,తెలంగాణ లోనే అత్యధిక అవార్డులు సాధించిన ఆసుపత్రిగా ఘనత సాధించింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ చేతుల మీదుగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండా శ్రీధర్ ఈ పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ సూపరింటెండెంట్ కేటగిరీతో పాటు అనస్థీషియా సివిల్ సర్జన్‌గా డాక్టర్ శ్రీధర్ అవార్డు పొందారు. ఆరోగ్యశ్రీ సేవలను సమర్థవంతంగా అందించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు టీ–హబ్ ద్వారా అత్యధిక సంఖ్యలో రక్త పరీక్షలు నిర్వహించినందుకు గాను జిల్లా ఆసుపత్రికి మరో రెండు అవార్డులు దక్కాయి. రేడియాలజీ విభాగంలో అత్యధికంగా స్కానింగ్స్ నిర్వహించినందుకు డాక్టర్ సంధ్యారాణి కూడా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావుల ప్రత్యేక చొరవ,వైద్యులు మరియు సిబ్బంది నిరంతర కృషితోనే ఈ అవార్డులు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తానని,ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను మరింతగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లా ఆసుపత్రికి రాష్ట్రస్థాయిలో దక్కిన ఈ ప్రత్యేక గుర్తింపు పట్ల జిల్లాలోని వైద్య వర్గాలు,ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ శ్రీధర్ కు అభినందనలు తెలిపారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు










జగిత్యాల్ ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజాకలం)

జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బంది,బార్ అసోసియేషన్ సభ్యులను గ జిల్లా జడ్జి శ్రీమతి రత్న పద్మావతిహా అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. గత నెల 28వ తేదీన శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో మొత్తం 3034 కేసులు పరిష్కారం కావడం జరిగింది. ఈ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది,బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఈ రోజు జిల్లా కోర్టు ప్రాంగణంలో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీమతి రత్న పద్మావతి మాట్లాడుతూ, పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి కేసుల్లో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి “రాజీ మార్గమే రాజమార్గం”అని అవగాహన కల్పించినందువల్లే ఈ స్థాయిలో కేసులు పరిష్కారం కావడం సాధ్యమైందన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఇరు వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ స్థాయిలో కేసులు పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ, రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, అదనపు జిల్లా జడ్జి శ్రీ నారాయణ, లీగల్ సెల్ సెక్రటరీ శ్రీ వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ, మేజిస్ట్రేట్ లు లావణ్య,నికిషా, డిఎస్పి రఘు చందర్, బార్ కౌన్సిల్ జగిత్యాల అధ్యక్షులు, అలాగే జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వీబీ జీరామ్ జీ పథకంలో నిబంధనలు సడలించాలి

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి,ఏప్రిల్ 07 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళ వారం పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి తీసుకువచ్చిన వీబీ జీరామ్ జీ 2025 చట్టం ఉపాధి కూలీల పాలిటశాపంగా మారిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వీబీ జీరామ్ జీ పథకం ఉపాధి కూలీల పాలిట శాపంగా మారిందని కూలీ పనులకు వచ్చిన వారి హాజరు వేయడానికి ఐరిస్ పద్ధతిలో హాజరు నమోదు చేయడంతో చాలా మంది కూలీల పేర్లు నమోదు కావడం లేదని తెలిపారు. ఫలితంగా ఉపాధి కూలీ కోసం వచ్చి తిరిగి వెళుతున్నారని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కూలీల పేర్ల నమోదు విషయంలో నిబంధనలు సడలించి ఉపాధి కూలీలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందనీ వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మరో మారు వీబీ– జీరామ్ జీ చట్టంపై సమీక్షించి నిబంధనలో మార్పులు తీసుకురావాలని మంత్రి కోరారు. నియోజక వర్గంలో సమస్యల పరిష్కారం కోసం వారంలో మూడు రోజులు క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని మంత్రి అడ్లూరి తెలిపారు. ప్రతి రోజు ఒక గ్రామంలో పర్యటించి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. శ్రీరాములపల్లి గ్రామంలో ఇళ్లపై నుంచి వెళ్లుతున్న విద్యుత్ తీగల సమస్యకు పరిష్కరించామని మంత్రి తెలిపారు. 30 ఏళ్లుగా శ్రీరాములపల్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను రెండు సంవత్సరాల కాలంలోనే పరిష్కరించినట్లు వివరించారు. గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువలో నిండిన పూడికను త్వరలోనే తొలగిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా వాటినీ పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామ ప్రజలకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మజీద్, ఆర్.ఐ జీవన్,పీఏసీఎస్ చైర్మెన్ భీమాసంతోష్, నేరెళ్ళ మహేష్,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదుల ప్రమాణ స్వీకార కార్యక్రమం

ఎండపల్లి, ధర్మపురి ఏప్రిల్ 07 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం రోజున సాయంత్రం కోర్ట్ ఆవరణ లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి గా ధర్మపురి కోర్ట్ న్యాయ మూర్తి శ్రీమతి యేగి జానకి పాల్గొనడం జరిగింది. ఈ సంద ర్భంగా బార్ అసోసియేషన్ ఎలెక్షన్ లో అధ్యక్షులుగా బందెల రమేష్ కు 13 ఓట్లు రాగా ప్రత్యర్థి కి 4 ఓట్లు రాగా 9 ఓట్ల మెజార్టీ తో బందెల రమేష్ విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి గా రామడుగు రాజేష్ కు 9 ఓట్లు రాగా ప్రత్యర్థికి 8 ఓట్లు రాగా 1 ఓటు మెజార్టీ తో రామడుగు రాజేష్ గెలిచారు. ఎన్నికల అధికారిగా గూడ జితేందర్ రెడ్డి, కస్తూరి శరత్ కుమార్ లు వ్యవహరించారు. ఉపాధ్యక్షులు గా మామిడాల శ్రీకాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీ గా ఒరగంటి చంద్రశేఖర్ లు మహిళ ప్రతినిధి గా కలమడుగు కీర్తి, ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమం లో జగిత్యాల జిల్లా సీనియర్ న్యాయవాదులు, ధర్మపురి న్యాయవాదులు, పాల్గొనారు.



## రాజకీయాలకు అతీతంగా
# అభివృద్ధి కోసం పాటుపడతా

### - ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

- 20 కోట్ల నిధులతో భైంసా నుండి నిగ్వ మహారాష్ట్ర బోర్డర్ రోడ్ కు శంకుస్థాపన
- ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేలచే ప్రొసీడింగ్స్‌లు తీసుకోవడం ఏంటి?
- ప్రొటోకాల్ ఉల్లంఘించిన సర్పంచ్ ల పై చర్యలు తప్పవు



నిర్మల్ ఏప్రిల్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాజకీయాలకతీతంగా ముధోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. మంగళవారం కుబీర్ మండలంలోని మాలేగామ్ గ్రామంలో భైంసా నుండి మిర్జాపూర్, లింగా,కుంబి, నిగ్వ మహారాష్ట్ర బోర్డర్ వరకు 20 కోట్ల రూపాయల నిధులతో నిర్మిస్తున్న రోడ్డుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గత పది సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న రహదారిని బాగు చేయడం జరుగుతుందన్నారు. దశలవారీగా గ్రామీణ రోడ్లను మెరుగుపరుస్తానన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పలుమార్లు ముఖ్యమంత్రి, మంత్రులను నియోజకవర్గ శాసనసభ్యునిగా కలవడం జరిగిందన్నారు. అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రిని మంత్రులను, ప్రధానమంత్రిని కేంద్ర మంత్రులను, కలవడం జరుగుతుందన్నారు. బాసర ఆలయానికి నిధులు మంజూరు చేయాలని, గత పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఆలయ అభివృద్ధి కుంటుపడిందని పలుమార్లు శాసనసభలో ప్రస్తావించడంతోపాటు, ముఖ్యమంత్రికి మంత్రులను కలవడం జరిగిందన్నారు. 75 సంవత్సరాల చరిత్రలో తాను శాసనసభ్యునిగా ఎన్నికైనప్పటినుండి ఎవ్వరు మాట్లాడని విధంగా బాసర ఆలయం గురించి ఎక్కువగా మాట్లాడటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పలుమార్లు సమస్యలు విన్నవించడంతో ఒకేసారి ఆలయ నిర్మాణానికి 225 కోట్లు, ముధోల్ ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 200 కోట్లు నిధులు మంజూరు కావడం తన అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. అప్పట్లో నిధులు మంజూరు చేయకపోతే మంత్రి కొండా సురేఖ సమక్షంలో భిక్షాటన చేసైనా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధి కోసం ప్రోటోకాల్ ప్రకారం అందరినీ విన్నవిస్తున్న దశల వారిగా నిధులు తెచ్చుకుంటున్నామని అన్నారు. అయితే ప్రోటోకాల్ కు విరుద్ధంగా ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే వద్ద కొంతమంది సర్పంచ్ లు ప్రొసీడింగ్ లు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా కొందరు సర్పంచ్ వ్యవహరించాల్సిందిగా సూచించారు. తప్పు చేస్తే నా పని నేను చేయాల్సి వస్తుందని, అభివృద్ధి పనులు చేయడానికి స్వాగతిస్తానని, తన ప్రతిష్టకు భంగం కలిగిస్తానంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా తన వద్ద భేదాభిప్రాయాలు లేవని రాజకీయాలకతీతంగా అందరి పనులు చేస్తానని సూచించారు. సరస్వతి అమ్మవారి ఆశీర్వాదం తనపై ఉందని నా హాయంలో ఆలయపున నిర్మాణం కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రెండున్నర సంవత్సరాల్లో పార్టీలకు అతీతంగా నాలుగు వేల మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి - ఆసుపత్రిలో మందుల నిల్వలు సమృద్ధిగా ఉంచాలి
- ఖమ్మం వెంకటేశ్వర్ నగర్ అర్బన్ పి.హెచ్.సి. ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఏప్రిల్ 07(ప్రజా కలం న్యూస్ )

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. జిల్లా కలెక్టర్, స్థానిక వెంకటేశ్వర నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్, మెడికల్ వార్డ్, టాయిలెట్లు, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆసుపత్రిలో అవసరమైన ఔషధాల లభ్యతపై ప్రత్యేకంగా విచారించి, అన్ని రకాల అవసరమైన మందులను తగిన స్థాయిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి రిజిస్టర్లన్నింటినీ స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అన్ని పరీక్షల రిపోర్ట్ లను వీలైనంత త్వరగా రోగులకు అందించాలని ఆదేశించారు. రోగులకు సమయానికి సరైన చికిత్స అందించడంతో పాటు అవసరమైన అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి పి. హెచ్.సి., అర్బన్ పి. హెచ్.సి. లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలను సమగ్రంగా సమర్పించాలని, ప్రతి కేంద్రంలో మంజూరు చేసిన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, ఈ నివేదిక ఆధారంగా జిల్లాలో సిబ్బంది ఎక్కడ తక్కువగా ఉన్నారో గుర్తించి తక్షణమే సరి చేయడానికి అవకాశం ఉంటుందని, డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బంది సంఖ్యను కూడా ఖచ్చితంగా ధృవీకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఓ డాక్టర్ మోత్యను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వైద్యాధికారిణి ఐ. దేవి శ్రీ, నర్సింగ్ అధికారిణి సయ్యద్ షమీమ్, ఫార్మసిస్ట్ ఎస్.కే. ముదస్సర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జీళ్ళచెరువులో నూతనంగా ఏర్పాటు చేసిన
# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాలేరు ఏప్రిల్ 07(ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలం పరిధిలోని మంగళవారం జీళ్లచెరువు గ్రామంలోని ఈ సందర్భంగా ఎంపీ,మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా జీళ్ళచెరువు పరిసర ప్రాంతాల రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, వారి ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు ఇది ఒక కీలక అడుగని అన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి . స్థానిక సర్పంచ్ ఐత గాని వెంకటరమణ–నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, గుడి చైర్మన్ లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హాఫీసుద్దీన్, డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు మంకెన వాసు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొక్కఉ



పేందర్, సైదా నాయక్, సర్పంచులు మల్లెల స్వాతి–ఉపేందర్ వెంకటేష్ నాయక్, బాణోత్ నాగేశ్వరరావు, బొంగానాయక్, బదావత్ నరేష్, బాణోతు రవి, జర్పుల శ్రీను నాయక్, నీలకంఠం,కాంగ్రెస్ నాయకులు బజ్జూరి వెంకటరెడ్డి, జొన్నలగడ్డ రవి కుమార్, జూకురి గోపాలరావు, , మాదాసు ఉపేందర్, కంచర్ల జీవన్ రెడ్డి, చాట్ల పరుశురాం, బాణోతు రవి, కూసుమంచి మండల ఎమ్మార్వో , మార్క్ఫెడ్ ,వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఏరియా ఆసుపత్రికి ఐదు రాష్ట్రస్థాయి పురస్కారాల పంట

### ప్రజా పాలన - ప్రగతి కార్యక్రమంలో భాగంగా అవార్డుల ప్రదానం
### వైద్యారోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా ఇద్దరు వైద్యులకు రెగ్యులర్ నియామక పత్రాలు

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, ఏప్రియల్ 07:

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి' కార్యక్రమంలో భాగంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి 5 విభాగాలలో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి. గిరిజన ప్రాంత ప్రజలకు అందిస్తున్న విశేష వైద్య సేవలకు గాను ఈ గౌరవం దక్కినందుకు ఆసుపత్రి వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

అవార్డు గ్రహీతలు:

1. డాక్టర్ క్రాప విజయ్: మెరుగైన శిశు వైద్యం అందించినందుకు.
2. డాక్టర్ ఎం. రామకృష్ణ (సూపరింటెండెంట్): ఎక్కువ సంఖ్యలో ల్యాబ్ టెస్టుల నిర్వహణ మరియు గిరిజన ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందించినందుకు రెండు విభాగాలలో అవార్డులు.
3. కృష్ణవేణి (మిడ్ వైఫ్ స్టాఫ్ నర్స్): అత్యధిక డెలివరీలు చేసినందుకు.
4. వెంకటరావు (సానిటేషన్ సూపర్వైజర్): 98% అబాస్ (ఏ బి ఏ ఎస్ ) హాజరు నమోదు చేసినందుకు.

అదేవిధంగా, ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ డాక్టర్లుగా పనిచేస్తున్న డాక్టర్ శంషాద్, డాక్టర్ కౌండిన్య గార్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా రెగ్యులర్ నియామక పత్రాలను అందుకున్నారు.

కృతజ్ఞతలు:

ఈ విజయానికి సహకరించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కి, జిల్లా కలెక్టర్ గారికి, ఐటీడీఏ పీఓ గారికి, డీసీహెచ్ఎస్ రవిబాబు గారికి, డీఎంహెచ్ఓ మరియు




భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్ఓ గారికి ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. రాష్ట్రస్థాయిలో వచ్చిన మొత్తం అవార్డులలో 20% మన జిల్లాకే రావడం గర్వకారణమని, దీనికి డీసీహెచ్ఎస్ రవిబాబు గారి సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, "తక్కువ సిబ్బంది ఉన్నప్పటికీ అంకితభావంతో పనిచేస్తే రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చనే భరోసా ఈ అవార్డుల ద్వారా లభించింది. భవిష్యత్తులో మరిన్ని వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తాం," అని తెలిపారు. ఆసుపత్రికి అండగా నిలుస్తున్న డాక్టర్లు, నర్సింగ్, పారామెడికల్, సానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు మరియు తమపై నమ్మకం ఉంచిన రోగులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలిగా
# గోడేటి భగవత్ కుమారి నియామకం

- అభినందనలు తెలిపిన టిడిపి శ్రేణులు

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక , ఏప్రియల్ 07 :-

అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థాన ట్రస్టు బోర్డు సభ్యులను కూటమి ప్రభుత్వం మంగళవారం నాడు నియమించింది. పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్ సతీమణి గోడేటి భగవత్ కుమారిని అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎటపాక మండల టిడిపి శ్రేణులు గోడేటి భగవత్ కుమారికి అభినందనలు తెలిపారు. అయితే మొత్తం 16 మంది ట్రస్ట్ బోర్డు సభ్యులతో పాటు అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ గా ఇనుగంటి వెంకట రోహిత్ ను కూటమి ప్రభుత్వం నియమించింది.



# సాంప్రదాయ క్రీడలు మేలు

- జూదాలు , పేకాట వద్దు
- ఎటపాక ఎస్సై జి.అప్పలరాజు హెచ్చరిక

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, ఏప్రియల్ 07: మండల పరిధిలో ఎవరైనా , ఎంతటి వారైనా జూదాలు , పేకాట నిర్వహిస్తే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని ఎటపాక ఎస్సై జి.అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎటపాక పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా పేకాట , కోడి పందేలు నిర్వహిస్తే పోలీస్ స్టేషన్ కు వెంటనే సమాచారం అందించాలని ప్రజానీకానికి సూచించారు. వెంటనే వాటిపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. టైం పాస్ కోసం , ఖాళీగా ఉన్నామని , పేకాట వంటి జూదాలు ఆడి ఉండలేక పోతున్నామని ఇలా చెబుతూ ఎవరైనా పేకాటలు , జూదాలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. సాంప్రదాయ క్రీడలైన వాలీబాల్ , క్రికెట్ వంటి ఆటలు ఈ వేసవిలో మంచి ఆటవిడుపునిస్తాయని తెలిపారు. అలాగని బెట్టింగులు వేసిన ఊరుకోబోమన్నారు. ఎటపాక మండలంలో ఏ మారుమూల ప్రాంతాల్లో పేకాట , కోడి పందాలు ఆడిన మాకు సమాచారం ఇవ్వండి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్సై జి.అప్పలరాజు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# లక్షల ప్రజాధనం 'పందుల' పాలు

### జెన్కో ఆర్అండ్ఆర్ సైట్ పై అధికారుల నిర్లక్ష్యం!
### నిర్వాసితుల కోసం భవనాలు.. పందులకు నివాసాలు:
### దుర్గంధం వెదజల్లుతున్న పునరావాస కేంద్రం...

మల్హర్, ఏప్రిల్ 07 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచెర్ల లో టిఎస్ జెన్కో ఓసిపి బ్లాక్ 01 లో గృహాలు కోల్పోయిన తాడిచెర్ల – కాపురం గ్రామాల జెన్కో భూ నిర్వాసితుల కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన పునరావాస కేంద్రం ప్రస్తుతం పందుల నిలయంగా మారింది. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన మౌలిక సదుపాయాలు అధికారుల పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారడమే కాకుండా, పందుల పెంపకందారులకు అడ్డాగా మారడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడ నిర్వాసితుల సౌకర్యార్థం నిర్మించిన కమ్యూనిటీ హాల్, పబ్లిక్ పార్కు, హెల్త్ సబ్ సెంటర్, అంగన్‌వాడీ భవనాలు ప్రస్తుతం పందుల ఆవాసాలుగా మారిపోయాయి. గతంలోనే ఈ విషయంపై పలు పత్రికల్లో వార్తలు వచ్చినా, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. వందలాది పందులు ఈ భవనాల్లో తిష్టవేయడంతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. ఆర్అండ్ఆర్ పార్క్ ప్రాంతాన్ని పందుల యజమానులు తమ సొంత ఆస్తిగా వాడుకుంటున్నారు. సమీపంలోని పంట పొలాలకు వెళ్లే రైతులపై పందులు దాడులకు తెగబడుతుండటంతో రైతులు అటువైపు వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. అధికారుల ఉదాసీనత వల్లే పందుల యజమానులు ఇంతలా రెచ్చిపోతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రజాధనం వృథా.. పట్టించుకోని యంత్రాంగం**

సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి సౌకర్యాలు కల్పించినా, సరైన నిర్వహణ లేకపోవడంతో అంతా అస్తవ్యస్తంగా మారింది. నిర్వాసితుల కోసం కట్టిన లక్షల రూపాయల భవనాలు పందుల పెంపకానికి ఉపయోగపడటం దురదృష్టకరం" అని పలువురు వాపోతున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పందుల బెడదను తొలగించి, నిర్మించిన భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.



## శ్రీ జ్యోతిబా పూలే జయంతి వేడుకలలో
# పాల్గొని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం, ఏప్రిల్ 07(ప్రజా కలం న్యూస్ )

ఏప్రిల్ 11న నిర్వహించు జ్యోతిబా పూలే జయంతి వేడుకలలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11న ఉదయం గం.10-00 లకు ఖమ్మం శ్రీ శ్రీ సర్కిల్ వద్ద ఉన్న శ్రీ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలంకరణ నిర్వహించనున్నట్లు, ఇట్టి వేడుకలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



## గ్రామ పంచాయతీ వ్యవస్థ ద్వారానే గ్రామంలో అభివృద్ధి పనులు సజావుగా జరుగుతాయి

### - ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



నిర్మల్ ఏప్రిల్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుంటాల మండలంలోని వెంకూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ వ్యవస్థ ద్వారానే గ్రామంలో అభివృద్ధి పనులు సజావుగా జరుగుతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఓలా గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భవనం గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. గల్లీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో, స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కుళాయి నీటి సరఫరాను ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## అధైర్య పడవద్దు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంది

### - ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్



మల్హర్, ఏప్రిల్ 07 ప్రజాకలం ప్రతినిధి : మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పట్టి సమ్మయ్య కుటుంబాన్ని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ఆదేశాల మేరకు మంగళవారం ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరమార్శించి ప్రగడ సంతాపాన్ని తెలియజేశారు. మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం సహాయంగా అందించడం జరిగింది, అధైర్య పడవద్దని అండగా కాంగ్రెస్ పార్టీ, మేము ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వేల్పుల రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు జనగామ లక్ష్మిరాజు, వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలేరు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ఆరోగ్య చిట్కాల అవగాహన

### 'ఆరోగ్యమే మహాభాగ్యం' -యువత మేలుకో ఆర్గనైజేషన్ సూచనలు



పాలేరు ఏప్రిల్ 07(ప్రజా కలం న్యూస్ )

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాలేరు ప్రభుత్వ పాఠశాలలో యువత మేలుకో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆరోగ్య చిట్కాల గురించి అవగాహనా సదస్సు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, వ్యాయామం వంటి ముఖ్య చిట్కాలు చెప్పబడ్డాయి. ఆర్గనైజేషన్ అధ్యక్షులు శీలం రామకృష్ణ మాట్లాడుతూ, "ఆరోగ్యంగా ఉంటే జీవితం ఆనందంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం ఆరోగ్య పరీక్షలు చేపట్టుకోవాలి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వహించొద్దు. ఆరోగ్యమే మహాభాగ్యం. ఎటువంటి వ్యాధుల భారాన్నా పడకూడదు" అని సూచించారు. పిల్లలు రోజువారీ జీవితంలో ఈ చిట్కాలను అమలు చేస్తే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని ఎంఫాసిస్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు బొంకూరి నాగార్జున, బండారు రాజు, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధాని మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల ఆరోగ్య అవగాహనను పెంచుతాయని, భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని తెలిపారు. స్థానికంగా ఆరోగ్య సందేశాలు వ్యాప్తి చేయడంలో ఈ సదస్సు ముఖ్య పాత్ర పోషిస్తుందని అందరూ అభిప్రాయపడ్డారు.

## తాడిచర్ల కళాశాలకు కొత్త శోభ

### - తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మహర్దశ
### - రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు - అత్యాధునిక వసతులు డిజిటల్ బోధన
### - ప్రయోగ పరీక్షలకు అత్యాధునిక పరికరాలు



మల్హర్, ఏప్రిల్ 07 ప్రజాకలం ప్రతినిధి...

మల్హర్ మండల కేంద్రం లోని గల ప్రభుత్వ జూనియర్ కళాశాల తాడిచర్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలతో జిల్లాలోనే అగ్రగామిగా నిలుస్తోంది తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల గత రెండేళ్లుగా ప్రిన్సిపాల్ శ్రీమతి విజయదేవి చొరవతో పెద్ద ఎత్తున విద్యార్థుల చేరికతో పాటు విద్య ప్రమాణాల్లో ప్రత్యేకతను చాటుకుంటున్న కళాశాలకు ఇటీవల ఇంటర్ బోర్డు నుంచి అమ్మ ఆదర్శ కళాశాల కమిటీ ద్వారా రూపాయలు 15 లక్షల నిధులు మంజూరయ్యాయి భూపాల్ పల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో కళాశాల లోని అన్ని బ్లాక్ లకు రంగులు వేయించారు అలానే వాటర్ ప్లాంట్ ఇంకా వాష్ రూమ్స్ మరమ్మతులు చేయించారు. ఆకర్షణీయమైన ప్రధాన ద్వారం ఏర్పాటు కళాశాల ఆవరణలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు దీంతో కళాశాల సర్వాంగ సుందరంగా మారింది కళాశాల ఇప్పుడు నూతన శోభను సంతరించుకొనివచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఆహ్లాద కరమైన వాతావరణం అందించేందుకు సిద్ధంగా ఉంది

**""విద్యార్థులకు డిజిటల్ తరగతులు"**

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కళాశాల సిద్ధమైంది వచ్చే విద్య సంవత్సరం నుండి డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక డిజిటల్ ఫ్యానల్లను ఏర్పాటు చేశారు.

**"కోర్సుల వివరాలు"**

ప్రస్తుతం ఈ కళాశాలలో విద్యార్థుల కోసం నాలుగు గ్రూపులు MPC, BiPC, CEC & HEC తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం గ్రూపులతో నడుస్తుంది ఇవే కాకుండా ఈ సంవత్సరం నుంచి ఇంకా కొత్త గ్రూపులు వచ్చే అవకాశం ఉంది.

ఏఎమ్మార్ కంపెనీ ఓపెన్ కాస్ట్ ద్వారా విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం

విశాలమైన ఆటస్థల మైదానం అనుభవజ్ఞులైన ధ్యాపకులచే విద్య బోధన

**"ఫలితాల్లో టాప్"**

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాల్లో గత సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో రెండవ స్థానం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది.

ఫలితాల్లో మేటిగా నిలుస్తుండటంతో స్థానిక విద్యార్థులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా ఈ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## కాంగ్రెస్ పాలనలో పేదల ఆరోగ్యానికి భరోసా

### - ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
### - 268 మంది లబ్దిదారులకు రూ.75.40 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఖమ్మం ఏప్రిల్ 07(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలోనే మంగళవారం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని, పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్సలు పొందిన పేదలను ఆదుకునేందుకు తన సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంగళవారం ఖమ్మం లోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. పలు మండలాలకు చెందిన 268మందికి రూ. 75.40 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి తదితరులతో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ.. ఆరోగ్య భద్రతలో ముందుంటూ పేదలకు అండగా నిలుస్తోశీదని చెప్పారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన లబ్ధిదారులంతా.. ఎంపీ రఘురాం రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో.. వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత తుళ్ళ రవికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అభినందనలు

### - బాబు జగ్జీవన్ రావు 119వ జయంతి వేడుకల్లో సత్కారం.
### - దళిత సేవలో ముందుండాలని హితవు.



ఏప్రిల్ 07 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట)

మహానేత, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావు 119వ జయంతి ఉత్సవాల సందర్భంగా దళిత సేవలో విశేష కృషి చేసిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుళ్ళ రవికి "దళిత రత్న" అవార్డు లభించింది. ఈ సందర్భంగా తుళ్ళ రవి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి, ఆయన చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు తుళ్ళ రవిని శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. దళితుల అభివృద్ధి కోసం తుళ్ళ రవి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్న ఎమ్మెల్యే, సమాజ సేవలో ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతూ దళితుల హక్కుల సాధన కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇటీవలి మరణించిన డిసిఓ నర్సయ్య కుటుంబానికి జిల్లా అధికారుల ఆర్థిక సహాయం



నిర్మల్ ఏప్రిల్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో డిసిఓ గా పని చేస్తూ, రోడ్డు ప్రమాదంలో మరణించిన నర్సయ్య కుటుంబానికి జిల్లా అధికారులు మంగళవారం ఆర్థిక సహాయం చేశారు.

కలెక్టర్ ఛాంబర్ లో, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ చేతులమీదుగా చెక్కులు, జిల్లా అధికారుల సంఘం తరుపున నగదు అందించారు.

కలెక్టర్ మాట్లాడుతూ, వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

చెక్కులను అందించినవారిలో సిపిఓ జీవరత్నం, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఎస్టీఓ సరోజ, డిపిఓ శ్రీనివాస్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శంకర్, ఎస్సీ, మైనారిటీ, బిసి సంక్షేమ శాఖల అధికారులు దయానంద్, మోహన్ సింగ్, శ్రీనివాస్, డిసిఎస్ఓ రాజేందర్, డిఎం ఇండస్ట్రీస్ నరసింహా రెడ్డి, ఇతర అధికారుల ఉన్నారు.

## జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతున్న గాంజా గస్తీ కార్యక్రమం

### - గాంజా, మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి
### - జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల




నిర్మల్ ఏప్రిల్ 07 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నిర్మల్ జిల్లాలో గాంజా వినియోగం మత్తు పదార్థాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆధ్వర్యంలో "గాంజా గస్తీ" కార్యక్రమాన్ని విస్తృతంగా,సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లోని ప్రజలకు, విద్యార్థులకు గాంజా వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గాంజా, మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు, యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని వివరించారు. ముఖ్యంగా యువత గాంజా వంటి మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాంజా, మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు, అలాగే ఎవరైనా గాంజా విక్రయం లేదా వినియోగంపై సమాచారం తెలిసినట్లయితే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆమె తెలిపారు.

## కల్వకుంట్ల కవిత నూతన పార్టీ ఆవిర్భావంకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరణ



ఖమ్మం ఏప్రిల్ 07(ప్రజా కలం న్యూస్ )ఖమ్మం 2008 లో ప్రారంభమైన తెలంగాణ జాగృతి సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ ధ్యేయంగా , తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంస్థ యొక్క లక్ష్యాలు నిర్దేశించుకుని గత 18 సంవత్సరాలుగా శ్రీమతి కల్వకుంట్ల కవిత నాయకత్వంలో సమర్థవంతంగా నిర్వహించబడుతుంది . తెలంగాణ సాధన సమయంలోను , తెలంగాణ జాగృతి యొక్క పోరాటం , ఉద్యమంలో తెలంగాణ జాగృతి పాత్ర అనిర్వచనీయం . నీళ్లు నిధులు నియామకాలు ప్రతిపాదికన సాధించుకున్న తెలంగాణ గత పది సంవత్సరాల్లో అనుకున్న మేర లక్ష్యాలను అందుకోవటంలో వెనకబడ్డదని భావించి , సామాజిక తెలంగాణ ధ్యేయంగా శ్రీమతి కలవకుంట్ల కవిత ఒక కొత్త రాజకీయ పార్టీకి శ్రీకారం చుట్టారు . ఈనెల 25వ తారీకు అందుకు ముహూర్తాన్ని నిర్ణయించడం జరిగింది . ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా , ప్రతి నియోజకవర్గం , ప్రతి మండలం , ప్రతి గ్రామం నుండి అన్ని వర్గాల ప్రజలను , మేధావులనుబి , విద్యావంతులను , విద్యార్థులను , యువతను , మహిళలను అందరినీ , పార్టీ ఆవిర్భావ సభకి తెలంగాణ జాగృతి పక్షాన ఇదే మా ఆహ్వానం. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఖమ్మం ప్రెస్ క్లబ్లో జరిగినటువంటి సమావేశంలో, ఈనెల 25న హైదరాబాద్ మేడ్చల్లో, అధ్వయ కన్వెన్షన్ లో జరిగేటువంటి కల్వకుంట్ల కవిత గారి నూతన పార్టీ ఆవిష్కరణ బ్రోచర్ను విడుదల చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ , జిల్లా ప్రధాన కార్యదర్శి వనం నాగేంద్ర కుమార్ , రాష్ట్ర కార్యదర్శి కిషన్ నాయక్ , ధరావత్ గణేష్ నాయక్ , భూక్య లక్ష్మణ్ నాయక్ , గుగులోత్ నవిన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు .

## అల్లిపురం గ్రామాభివృద్ధికి 48 లక్షలతో శంకుస్థాపనలు

### రోడ్లు, డ్రైనేజీలు, స్మశాన వాటిక పనులకు అభివృద్ధి.
### గ్రామాల సమగ్ర సుందరీకరణకు ప్రభుత్వం కట్టుబాటు - వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



ఏప్రిల్ 07 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట)

వరంగల్ నగర పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 44వ డివిజన్‌లో అల్లిపురం గ్రామ అభివృద్ధికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రూ.48 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా స్మశాన వాటికలో సౌకర్యాల కల్పన కోసం రూ.18 లక్షలతో పనులు ప్రారంభించగా, మరో రూ.30 లక్షలతో పలు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, స్మశాన వాటికలు వంటి సదుపాయాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని పేర్కొన్నారు. అల్లిపురం గ్రామంలో స్మశాన వాటిక వద్ద సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో రోడ్ల దెబ్బతినడం, డ్రైనేజీల కొరత వల్ల వర్షాకాలంలో సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో కొత్త పనులు చేపడుతున్నామని చెప్పారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, పనులు నాణ్యతతో పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తానూరులో అక్రమ ఇసుక లారీ సీజ్

### - కఠిన చర్యలు తప్పవన్న ఎస్సై జుబేర్ హెచ్చరిక

తానూర్, ఎప్రిల్ 07( ప్రజా కలం): మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుండి తానూరుకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పోలీసులు పట్టుకున్నారు, ముందస్తు సమాచారం మేరకు ఎస్సై షేక్ జుబేర్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు, ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాహనాన్ని సీజ్ చేశారు, తదుపరి చార్యుల నిమిత్తం తహశీల్దార్ కు అప్పగించినట్లు ఎస్సై జుబేర్ తెలిపారు, నిబంధనలు ఉల్లంఘించి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు.



## చరవాణిలో సూరం లింగయ్య ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు

### - పార్టీపరంగా ఆదుకుంటామని బరోసా కల్పించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు



( వరంగల్/ పర్వతగిరి) ఏప్రిల్ 7, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం కొంకపాక గ్రామానికి చెందిన కంటెస్టెడ్ ఎంపీటీసీ సూరం లింగయ్య గత ఐదు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ హాస్పిటల్ కి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు కి వివరించగా వారి కుటుంబ సభ్యులతో చరవాణి లో మట్లాడి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ సూరం లింగయ్య కుటుంబానికి పార్టీ పరంగా, ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని వారి కుటుంబానికి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కుటుంబానికి ఆదుకుంటామని శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

## ట్రాన్స్ ఫర్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ వసూళ్లలో ఆలస్యాలు

సికింద్రాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ట్రాన్స్ ఫర్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ వసూళ్లలో జరుగుతున్న నిరంతర ఆలస్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద అన్నారు. . బోర్డుకు చట్టబద్ధంగా రావలసిన ఆదాయం సమయానికి అందకపోవడం వల్ల అభివృద్ధి పనులు మరియు ప్రజా సేవలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అన్నారు. మధ్యవర్తిత్వ వ్యవస్థ కారణంగా ఏర్పడుతున్న ఈ ఆలస్యాలు అనవసరమైనవి మాత్రమే కాకుండా, కంటోన్మెంట్ బోర్డు ఆర్థిక స్వతంత్రతను దెబ్బతీస్తున్నాయి. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలంటే, బోర్డు ఆర్థికంగా బలపడడం అత్యవసరమని అన్నారు. అసెంబ్లీ లో ఎమ్మెల్యే శ్రీగణేష్ కి మాట్లాడేందుకు 4సార్లు అవకాశం వచ్చినా కంటోన్మెంట్ టీపీటీ బకాయిల విషయం లేవనెత్తకపోవడం దురదృష్టకరం. అంతే కాకుండా ఇప్పటి వరకు కంటోన్మెంట్ కు బకాయిలు ఉన్న సుమారు 100 కోట్ల రూపాయలు తక్షణమే ఛెల్లించె విధంగా క్రృషి ఛేయాలి.ప్రతిసారి అడుక్కోవడమే గాని రాష్ట్ర ప్రభుత్వం స్వత హాగా చెల్లించిన దాఖలాలు లేవు. టీపీటీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ద్వారా నేరుగా వసూలు చేయుటకు తక్షణ నిర్ణయం తీసుకోవాలని నేను బలంగా డిమాండ్ చేస్తున్నాను.ప్రజల అభివృద్ధి, పారదర్శక పరిపాలన, మరియు వేగవంతమైన సేవల కోసం ఈ నిర్ణయం అత్యంత కీలకం.ఆలస్యం ఇక అస్సలు సహించమని ఆమె అన్నారు.

## అంగన్వాడిలలో సౌకర్యాలు మెరుగుపడటానికి కృషి

### - కార్పొరేటర్ కొత్వాల విమలా దేవి

పాల్వంచ : అంగన్వాడిలలో సౌకర్యాలు మెరుగుపడటానికి కృషి చేస్తానని పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. పాత పాల్వంచ 46 వ డివిజన్ లోని అంగన్వాడీ కేంద్రాన్ని విమలాదేవి పరిశీలించారు. బడికి సంసిద్ధత కార్యక్రమం చేపట్టి, పిల్లలతో, తల్లితండ్రులతో మాట్లాడారు. పిల్లల ఎత్తు, బరువు తూకాలను పరిశీలించారు. బాలామృతం, కోడి గుడ్డు, పల్లీ చిక్కీస్ పంపిణీ చేశారు. కేంద్రం నిర్వహణ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విమలా దేవి మాట్లాడుతూ అంగన్వాడీల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నిర్వాహకులు జి. పద్మ, పి. నాగమణి, పి. రాజ్యలక్ష్మి, ఆర్. పి యాటా అరుణ, వార్డు ఆఫీసర్ దామెర్ల నరేష్, ఆయా నాగలక్ష్మి,కాలనీవాసులు మసనం శరత్, బూసి శ్రీను, గడదాసు నాగలక్ష్మి, డి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 10 నుంచి యూపీఐ తప్పనిసరి

హైదరాబాద్ : డిజిటల్ చెల్లింపుల్లో మరో కీలక అడుగు పడనుంది. దేశవ్యాప్తంగా టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. ఏప్రిల్ 10 నుంచి వాహనదారులు కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారా మాత్రమే టోల్ చెల్లించాల్సి ఉంటుంది. ట్రాఫిక్ రద్దీని తగ్గించి.. లావాదేవీల్లో పారదర్శకత పెంచడమే ఈ నిర్ణయం ప్రధాన లక్ష్యం.నిబంధనలు ఉల్లంఘించే వారికి నేరుగా ఈ-నోటీసులు పంపనుంది.

## జిరాంజి పథకాన్ని తక్షణమే రద్దు చేయాలి

తుగ్గలి: ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిరాంజి పథకాన్ని తక్షణమే రద్దు చేసి,పాత పద్ధతిన చట్టాన్ని కొనసాగించాలని తుగ్గలి మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీరాములు తెలియజేశారు.మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లి గ్రామంలో ఉపాధి పనుల ప్రదేశాల వద్దకు వెళ్లి బహిరంగ సమావేశం నిర్వహించారు. జిరాంజీ పథకం ప్రవేశపెట్టిన తర్వాత పనులు సరిగ్గా జరుగక ప్రజలు వలసలు వెళ్తున్నారని ఆయన తెలియజేశారు.జిల్లా వ్యాప్తంగా పనులు కూడా సరిగ్గా జరగడం లేదని ప్రభుత్వమే చెబుతుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.తక్షణమే ఫేస్ యాప్ ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## డ్రగ్ రహిత రాష్ట్రం లక్ష్యంగా దండి 2.0 పేరుతో సైకిల్ యాత్ర

తిరుపతి : డ్రగ్ రహిత రాష్ట్రం లక్ష్యంగా దండి 2.0 పేరుతో సైకిల్ యాత్ర ప్రారంభం అయింది. వైబ్రంట్స్ ఆఫ్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. తిరుపతి నుంచి విశాఖ వరకు 13 ఉమ్మడి జిల్లాల్లో సైకిల్ యాత్ర సాగునుంది. తిరుపతి ఎస్వీయు ఆడిటోరియం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమయింది. యువతతో పాటు ఆయా ప్రాంతాల్లో సైకిల్ యాత్రలో ఈగల్ టీం సభ్యులుపాల్గొన్నారు. యాత్రలో భాగంగా 25 విశ్వవిద్యాలయాలు, కళాశాలలో అవగాహన సదస్సులను నిర్వహిస్తారు. తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభించారు.

### జగ్గయ్య పేట - నందిగామ -విజయవాడ

## మార్గంలో బస్సుల రద్దీ తీవ్రం

ఎన్టీఆర్ జిల్లా : జగ్గయ్య పేట, నందిగామ నుండి విజయవాడకు వచ్చే బస్సుల్లో తీవ్ర రద్దీ నెలకొంది. ముఖ్యంగా జగ్గయ్యపేట– విజయవాడ సర్వీసుల్లో ప్రయాణికులు అధిక సంఖ్యలో రావడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. నందిగామలో బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి...ప్రభుత్వం అమలు చేస్తున్న "శ్రీశక్తి పథకం" కారణంగా మహిళలు పెద్ద ఎత్తున బస్సుల ద్వారా ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు మహిళలు బారులు తీరడంతో బస్సుల్లో నిలబడే స్థలం కూడా లేకుండా పోతుంది.అయితే, పెరిగిన రద్దీకి అనుగుణంగా సరిపడా బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### నర్సంపేటలో ప్రైవేట్ ఆసుపత్రులపై జిల్లా

# వైద్యాధికారుల ఆకస్మిక తనిఖీలు

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - లింగ నిర్ధారణ, భృణహత్యలపై సున్నా సహనం.

ఏప్రిల్ 07 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) నర్సంపేటలో ప్రైవేట్ ఆసుపత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ దృష్టి కేంద్రీకరించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు ఆదేశాల మేరకు స్థానికంగా ఉన్న పలు ఆసుపత్రులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా కరుణశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, జనని నర్సింగ్ హోమ్, వేద స్కానింగ్ సెంటర్లను పరిశీలించి రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ లేకుండా సేవలు అందిస్తున్న ఆసుపత్రుల యాజమాన్యాన్ని ప్రశ్నించి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రుల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ జరుగుతున్నట్లు, భృణహత్యలకు పాల్పడుతున్నట్లు వస్తున్న వార్తలపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. గర్భస్థ శిశువు స్థితిని తెలుసుకోవడం, సమస్యలు గుర్తించి చికిత్స చేయడం కోసమే స్కానింగ్ వినియోగించాలనీ, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణకు ప్రోత్సహించే తల్లిదండ్రులు,



పరీక్షలు నిర్వహించే వైద్యులు అందరూ చట్టపరమైన చర్యలకు గురవుతారని హెచ్చరించారు. ఈ విషయంలో పోలీస్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తామని తెలిపారు.అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం నమోదు చేసుకొని నిబంధనలు పాటిస్తూ సేవలు అందించాలని సూచించారు.ఈ తనిఖీలలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఐ. ప్రకాష్, ఎంసిహెచ్ డాక్టర్ విజయ్ కుమార్, ఎస్ఓ విజయలక్ష్మి, సిహెచ్ఓ లీలా, హెల్త్ ఎడ్యుకేటర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

# పైడిపల్లి-ఆరెపల్లెల్లో అభివృద్ధి శంకుస్థాపనలు

### - రూ.2.52 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు

### - ఎమ్మెల్యే నాగరాజు చేతుల మీదుగా పనుల ప్రారంభం



ఏప్రిల్ 7 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్ధన్నపేట) వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి, ఆరెపల్లె గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సుమారు రూ.2 కోట్ల 52 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా స్థానిక అంగన్వాడీ వర్కర్లు, ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని గ్రామాలు, కాలనీలలో రోడ్లు, డ్రైనేజీలు వంటి సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.పైడిపల్లి, ఆరెపల్లె గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న రోడ్ల దుస్థితి, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను పరిష్కరించేందుకు ఈ పనులు ఉపయోగపడతాయని తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత రాకపోకలు సులభతరం కావడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన అన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతగా, వేగంగా పూర్తి చేసేలా అధికారులు, కాంట్రాక్టర్లకు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతపై రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

### - అనూహ్య మలుపు తిరిగిన ఆటో డ్రైవర్ కుమారస్వామి జీవితం

(వరంగల్ / పర్వతగిరి) ఏప్రిల్ 07, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, వడ్లకొండ గ్రామానికి చెందిన కందికొండ కుమారస్వామి జీవితం అనూహ్య మలుపు తిరిగింది. కుటుంబాన్ని పోషించడానికి ఆటో నడుపుతూ సాధారణ జీవితం గడిపిన ఆయన, అనారోగ్యంతో పాటు జరిగిన ప్రమాదాల కారణంగా నేడు మంచానికే పరిమితమయ్యాడు. కొన్ని సంవత్సరాల క్రితం కుమారస్వామికి షుగర్ వ్యాధి నిర్ధారణ అయింది. అప్పటి నుంచి మందులు వాడుతూ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఒక రోజు ఆటోకు సంబంధించిన ఇనుప వస్తువు అతని కాలి వద్ద గాయపరచడంతో పరిస్థితి విషమించింది. ఆ గాయం ఇన్ఫెక్షన్‌గా మారి మొదట పాదం, తర్వాత తొడ వరకు వ్యాపించింది. వైద్యుల సూచన మేరకు కుడి కాలును తొడ వరకు తొలగించాల్సి వచ్చింది. ఈ



దుర్ఘటన నుంచి కోలుకునేలోపే మరొక కాలు కూడా సమస్యకు గురైంది. నరాల్లో రక్త ప్రసరణ సరిగా లేకపోవడంతో ఆ కాలును కూడా మోకాలి కింద వరకు తొలగించాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కుమారస్వామి పూర్తిగా కదలలేని స్థితికి చేరుకున్నాడు. ఇప్పటివరకు ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చిన ఆయన, ఒక్క సంవత్సరంలోనే పూర్తిగా ఆధారపడే పరిస్థితికి చేరుకోవడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. జీవనోపాధి లేక, వైద్య ఖర్చులు పెరిగిపోవడంతో కుటుంబంపై భారం మరింతగా పెరిగింది. ఈ నేపథ్యంలో దాతలు, సేవా సం స్థలు ముందుకు వచ్చి కుమారస్వామికి వీల్‌చైర్‌తో పాటు ఆర్థిక సహాయం అందించాలని ఆయన వినమ్రంగా కోరుతున్నారు. మనుషుల సహానుభూతి, దాతృత్వం అతని కుటుంబానికి మళ్లీ ఆశాకిరణం చూపగలదు.

# మెరుగైన సౌకర్యాలతో అమృత్ భారత్ 3.0



హైదరాబాద్ : రైలు ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు సరికొత్త చర్యలు చేపడుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 రైళ్లను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉంది. ప్రస్తుతం ఉన్న అమృత్ భారత్ రైళ్లు కేవలం నాన్ ఏసీ బోగీలతో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమృత్ భారత్ 3.0 రైళ్లలో ఏసీ బోగీలను ఏర్పాటు చేస్తున్నారు. నమూనా కోచ్‌ను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం రోజున పరిశీలించారు.రైలు ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే అమృత్ భారత్ రైళ్లను తీసుకువచ్చింది. ఇప్పటికే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 1.0, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 2.0 వెర్షన్లు, అందుబాటులోకి రాగా.. త్వరలోనే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3 .0 ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 శాంపిల్ కోచ్‌ను న్యూఢిల్లీలో శనివారం పరిశీలించారు. ఈ వీడియోను ఎక్స్ ద్వారా షేర్ చేశారు రైల్వే మంత్రి. ప్రయాణీకుల భద్రత, సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, కొత్త డిజైన్లు, మెరుగైన టాయిలెట్ మోడల్స్ అభివృద్ధి చేసిందని రైల్వే మంత్రి తెలిపారు. ఒక బోగిని అప్ గ్రేడ్ చేసి.. రూపొందించిన శాంపిల్ కోచ్‌ను పరిశీలించినట్లు ట్వీట్ చేశారు.అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 వెర్షన్‌లో ఏసీ కోచ్‌లు, కొత్త ఇంటీరియర్ డిజైన్ ఉంటుంది. అలాగే అప్‌గ్రేడ్ చేసిన ఫీచర్లతో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఇందులో నాన్-ఏసీ కోచ్‌లతో పాటు ఏసీ కోచ్‌లను కూడా ప్రవేశపెట్టనున్నారు. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 కోసం ప్రతిపాదించిన ఇంటీరియర్ డిజైన్‌లు, కలర్ స్కీమ్‌లతో కూడిన నమూనా కోచ్‌లను శనివారం అశ్వినీ వైష్ణవ్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న అమృత్ భారత్ రైలు సర్వీసుల కంటే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 రూపకల్పనలో భిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం అమృత్ భారత్ రైళ్లల్లో కేవలం జనరల్, స్లీపర్ క్లాస్ మాత్రమే ఉన్నాయి. అయితే అమృత్ భారత్ 3.0 వెర్షన్‌లో ఏసీ కోచ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అమృత్ భారత్ 1.0, 2.0 రైళ్ల నిర్వహణ అనుభవంతో వీటిని రూపొందిస్తున్నారు.అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 రైళ్లల్లో నాన్ ఏసీ కోచ్‌లతో పాటు ఏసీ కోచ్‌లు ఉంటాయి.

## ఏపీలో తప్పని డోలీ మోతలు

పోలవరం : పోలవరం జిల్లా రంపచోడవరం ఏజెన్సీలోని తడికోట గ్రామంలో చెట్టుపై నుండి పడి గిరిజనుడు చోళ్ల చిన్న రెడ్డి (20) తీవ్రంగా గాయపడ్డాడు. కదలలేని స్థితిలో ఉన్న చిన్న రెడ్డిని ఆసుపత్రికి తరలించేందుకు డోలి కట్టి ఐదు కిలోమీటర్లు గిరిజనులు మోసుకెళ్లారు. మధ్యలో ఏడు చోట్ల వాగులను అతి కష్టం మీద దాటి, 108 సిబ్బంది సహాయంతో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మధురవాడలో మద్యం మత్తులో కారు బీభత్సం

### చిన్నారికి గాయాలు.. వైయస్సార్ కాలనీలో ఘటన

మధురవాడ: ఆదివారం రాత్రి ఐటీ సెజ్ రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీ మీదుగా ఓ యువకుడు మద్యం మత్తు లో కారుతో బీభత్సం సృష్టించాడు. అతివేగంతో అడ్డదిడ్డంగా కారు నడుపుతూ రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న వాహ నాలను ఢీకొట్టాడు.ఈ క్రమం లో ఓ చిన్నారికి గాయా లయ్యాయి ప్రజలు భయాం దోళనతో పరుగులు తీయగా స్థానిక యువత కారును వెంబడించి కొమ్మాది జంక్షన్ వద్ద అడ్డుకున్నారు అప్పటికే పూర్తి మత్తులో ఉన్న డ్రైవర్ కారు దిగి రోడ్డుపైనే కూర్చుండిపోయాడు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

## మదనపల్లె తహసీల్దార్ కలెక్టరేట్ కు అటాచ్

### భారీ మొత్తంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు

మదనపల్లె :తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డిని కలెక్టరేట్‌కు అటాచ్ చేస్తూ కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. మదనపల్లె తహసీల్దార్ గా పని చేస్తున్న కిషోర్ రెడ్డి పై ఇదివరకే స్థానిక ప్రజాప్రతినిధి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. డీకేటి భూములు, చుక్కల భూములు ,మిలిటరీ భూములను వెబ్ లాండ్ లో ఎక్కించినట్లు ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పది రోజుల కిందటే జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మకలెక్టరేట్‌కు తహసీల్దార్ని పిలిపించుకుని విచారించారు. ఈ క్రమంలో తహసీల్దార్ బ్యాంకు ఖాతాకు పెద్ద మొత్తంలో నగదు బదిలీ అయినట్లు రాష్ట్ర సీసీఎల్ఏ, విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది.దీనిపై ప్రాథమిక విచారణతో కలెక్టర్ నిశాంత్‌కుమార్ తహసీల్దార్ కిషోర్ రెడ్డిని కలెక్టరేట్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులుజారీ చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా తహసీల్దార్ వద్ద ఉన్న ప్రభుత్వ సిమ్ కార్డు, రెండు డిజిటల్ కీ లను ఉన్నతాధికారులకు స్వాధీనం చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

## క్రికెట్ గొడవలో యువకుడి హత్య

విశాఖ: విశాఖ,ఆరిలోవ,పెద్దగదిలిలో సాయంత్రం క్రికెట్ గొడవ ఒక యువకుడి ప్రాణం తీసింది.పోలీసుల కథనం ప్రకారం..క్రికెట్ ఆడుతున్న సమయంలో అజిత్(23), కిషోర్(26) మధ్య వివాదం తలెత్తింది.మ్యాచ్ ముగిసిన తర్వాత కిషోర్ ఆగ్రహంతో పెద్దగదిలి జంక్షన్ వద్ద అందరూ చూస్తుండగానే అజిత్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన అజిత్ అక్కడికక్కడే మృతి చెందాడు.సిఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చిత్తూరు : పలమనేరు దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బెంగళూరు నుంచి తిరుపతి కు వస్తున్న సమయంలో పలమనేరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి కోర్టు లో పనిచేయు చున్న యుగంధర్ జూనియర్ అసిస్టెంట్, హరీష్ మృతి చెందారు. బెంగళూరు లో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఘటన జరిగింది. పలమ నేరు గంగవరం సమీపంలో ముందర వెళుతున్న లారీ ఉన్నట్లుండి ఆగడంతో వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది.

## చికెన్ వేస్టేజ్ లారీ బోల్తా..దుర్వాసనతో స్థానికుల అవస్థ

సూర్యాపేట: మునగాల మండలంముకుందాపురం వద్దచికెన్ వేస్టేజ్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది.హైద్రాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవేపై చికెన్‌వేస్టేజ్, కుళ్ళిపోయిన కోళ్లు చెల్లా చెదురుగాపడ్డాయి.ముక్కు పగిలేలా దుర్వాసనతో స్థానికులు, అటుగా వెళ్ళే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ చేపల చెరువులో చికెన్ వేస్టేజ్ వేసేందుకు తీసుకెళ్తుండగా ఘటన జరిగినట్లు సమాచారం.

## ఎమర్జెన్సీ డోర్లు ఎక్కడున్నాయో తెలుసుకోండి

ఉయ్యూరు : బస్సు రోడ్డు ప్రమాదానికి.. లేదా అగ్నిప్రమాదానికి గురైనపుడు ఎమర్జెన్సీ డోర్లు ఎక్కడ ఉన్నాయో తెలియక చాలామంది ఆందోళనకు గురవుతారు. ప్రయాణానికి ముందే బస్సులో తమకు కేటాయించిన సీట్లు.. ఎమర్జెన్సీ డోర్లు ఇతర రక్షణ సదుపాయాలపై ముందే జాగ్రత్తగా గమనించాలని ఉయ్యూరు ఆర్టీయే అధికారులు సూచించారు. కొన్ని బస్సుల్లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

విజయవాడ : మొక్కజొన్న రైతులను ఆదుకోవాలంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద వైకాపా నేతలు ఆందోళనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, రైతులతో కలిసి పీజీఆర్ఎస్ లో వినతిపత్రం అందించారు. మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గం పరిధిలోని మొక్కజొన్న రైతులను తక్షణమే ఆదుకోవాలి. మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. నందిగామ పరిధిలో ఉన్న రెండు డిస్టిలరీలకు స్థానిక రైతుల నుంచి పంటను కొనుగోలు చేయించాలి. ప్రభుత్వం రైతుల నుంచి మొక్కజొన్నను కొని డిస్టిలరీకు అందించాలి. ప్రభుత్వం వెంటనే నందిగామ నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా పరిగణించాలి. పంట చేతికొచ్చినప్పటికీ రైతుల నుంచి మొక్కజొన్న కొనడం లేదు. దళారులను ప్రోత్సహించడం కోసమే రైతుల నుంచి పంటను కొనడం లేదు. నందిగామలోని రెండు డిస్టిలరీలకు మొక్కజొన్నను కొనుగోలు చేయించాలి. లేని పక్షంలో రైతుల తరపున పోరాటం చేస్తామని అన్నారు.

## నూతన విద్యా సంవత్సరం గాను ముందస్తు విద్యార్థుల నమోదుకై ర్యాలీ

హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయులు గంగిశెట్టి మహేందర్ ఆధ్వర్యంలో వచ్చే విద్యాసంవత్సరం గాను ముందస్తు విద్యార్థుల నమోదుకై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 11వ,వార్డు 15వ వార్డు 17వ వార్డులో పర్యటించడం జరిగింది. 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురుకుల పాఠశాలలకు తీసిపోని సౌకర్యాలు ఉన్నాయని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. 17వ, వార్డు కౌన్సిలర్ గాదపాక రవీందర్ మాట్లాడుతూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హుస్నాబాద్ మండలంలో అత్యుత్తమ మైన ప్రమాణాలతో అన్ని సౌకర్యాలతో ఉన్న ఏకైక పాఠశాల అని అన్నారు. ప్రజలందరూ వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థిక భారం పెంచుకోవడం తప్ప ఏమీ లేదని, అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని అన్నారు. 15వ,వార్డు కౌన్సిలర్ ఆకుల రజిత వెంకన్న మాట్లాడుతూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆధునాతనమైన సైన్స్ ల్యాబ్, ఐటి/ఐటిఈఎస్, ఆటోమోటివ్ లాంటి ఏ పాఠశాలలో లేని ఒకేషనల్ కోర్సు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచిత విజ్ఞాన యాత్ర, ఇండస్ట్రియల్ టూర్స్, కరాటే, యోగ, ఉచిత నోట్ బుక్స్,టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్,రుచికరమైన మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన,పరిశుభ్రమైన డైనింగ్ హాల్, మినరల్ వాటర్, డిజిటల్ క్లాసెస్, స్పోర్ట్స్,ప్రతి సంవత్సరం విద్యార్థులకు సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్స్, లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్స్ తోపాటు పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే వసతులు కేవలం పిఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోనే ఉన్నాయని అలాగే రాబోయే సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం ఉదయం అల్పాహారం షూ,టైస్, బెల్ట్స్, అందజేస్తుందని ఇన్ని సౌకర్యాలు ఉన్న పాఠశాలల లో మీ యొక్క పిల్లలను చేర్చి ప్రభుత్వం కల్పించే అన్ని వసతులను ప్రజలు వినియోగించు కోవాలని అన్నారు.

# 'మావిగన్' ట్రెండింగ్..

విజయవాడ :సోషల్ మిడియాలో ప్రతీ రోజూ చాలా ట్రెండ్ అవుతుంటాయి. అలా ఫేమస్ అయిన పదాలు, క్రైమ్ స్టోరీస్, రియల్ సంఘటనలను మూవీస్‌గా తెరకెక్కించడం మనం చూశాం. కొన్నింటిని సాంగ్ లిరిక్స్‌లోనూ వాడుతుంటారు. గతంలో చాలా వరకూ అలాంటి ట్రెండింగ్ వర్డ్స్ సినిమాలుగా వచ్చాయి. తాజాగా అలాంటి రీసెంట్ వర్డ్‌ను మూవీ టైటిల్‌గా రిజిస్టర్ చేయించినట్లు ప్రచారం సాగుతోంది.గత రెండు రోజులుగా ఏ నోట విన్నా, సోషల్ మిడియాలో ఎక్కడ చూసినా మావిగన్ పేరే వినిపిస్తోంది. ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజా ప్రెస్ మిట్‌లో ఈ కొత్త పదాన్ని ఇంట్రడ్యూస్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన సందర్భంగా... ఆయన ప్రెస్ మిట్ పెట్టారు. ఈ బిల్లును వైసీపీ ఎంపీలు వ్యతిరేకించారు. ఈ క్రమంలో జగన్ ప్రెస్ మిట్‌లో మచిలీపట్నం – విజయవాడ – గుంటూరు ప్రాంతాలను కలుపుతూ రాజధాని ఏర్పాటు చేయాలంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. ఈ పేరు నచ్చకపోతే అమరావతి పేరుతోనే ఆ ప్రాంతాన్ని కాపిటల్‌గా చేయాలని అన్నారు. దీంతో ఆ పేరు మార్మోగుతోంది.మావిగన్ ప్రతిపాదనపై జగన్ సపోర్టర్స్ ఆయనకు మద్దతుగా సోషల్ మిడియాలో పోస్టులు పెడుతుంటే... కొందరు వైసీపీ అధినేతపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు సైతం భవిష్యత్తులో మావిగన్ రాజధాని అవుతుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలా ఈ పదం వైరల్ అయ్యింది.ఈ క్రమంలో పేరుతో టాలీవుడ్ ప్రొడ్యూసర్ ఫిలిం ఛాంబర్‌లో టైటిల్ రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఈ పేరుతో మూవీ తీయబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో నిజా నిజాలు తెలియాల్సి ఉంది. మరి పేరుతో ఎలాంటి జానర్ మూవీ తీస్తారో అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. పొలిటికల్ జానర్ అయితే బెటర్ అంటూ సలహాలు ఇస్తున్నారు.

**ఆచరణలో ఎపుడయ్యేన్ ?..**ఏపీలో ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఒక ప్రతిపాదన అమరావతి రాజధానికి ఆల్టర్నేషన్ గా చేసింది. దానిని ప్లాన్ బీగా చెప్పుకుంటోంది. దానికి మావిగన్ అని పేరు కూడా పెట్టారు. అయితే ప్రత్యర్థులతో పాటు విమర్శలు బుద్ధి జీవులు అంతా అది మావిగన్ కాదు ఎండమావిగన్ అని అంటున్నారు. ఎందుకంటే ఈ ప్రతిపాదన చాలా ఆలస్యంగా వచ్చింది. అంతే కాదు ఇపుడు ఏపీలో ఉన్న పరిస్థితుల్లో దీని సాధ్యాసాధ్యాలు పరిశీలించిన వారు అయ్యేది ఉండదని అంటున్నారు.. అది ఆచరణలో అయ్యేనా అంటే కాదనే చెబుతారు. ఎందుకంటే అమరావతికి ఇపుడు చట్ట బద్ధత అనే రాజ్యాంగ భద్రత ఉంది. అంతే కాదు న్యాయపరమైన రక్షణ కూడా ఉంది. అమరావతి రాజధానిగా ఏపీకి నిర్ణయిస్తూ పార్లమెంట్ ఆమోదించింది. రాష్ట్రపతి రాజ ముద్రతో ఇక రావడమే ఆలస్యం. అది కూడా జరిగి తీరుతుంది. అలాంటి అమరావతిని కదపడం సాధ్యమా అంటే అసాధ్యం అని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు: ఇక రేపటి రోజున ఏపీలో వైసీపీ అధికారం చేపడితే అమరావతికి బదులుగా మావిగన్ అంటూ రాజధాని మార్పు చేయడం సాధ్యమేనా అంటే కాదనే చెబుతారు. ఎలా అంటే పార్లమెంట్ లో మెజారిటీ సభ్యులు విభజన చట్టంలోని




సవరణను ఆమోదించాలి. నిన్న అంతా చూశారు, అధికార బీజేపీ విపక్ష కాంగ్రెస్ సహా దేశంలోని అన్ని పార్టీలు అమరావతికి జై కొట్టాయి. మళ్లీ అమరావతి కాదు మావిగన్ పేరుని చేర్చాలని అంటే మాత్రం వారు ఎందుకు అంగీకరిస్తారు. పైగా అక్కడ అప్పటికి ఎంతో కొంత నిర్మాణాలు జరుగుతాయి కదా ఆ భూములను ఏమి చేస్తారని ప్రశ్నించకుండా ఉండరు కదా అని మేధావులు అంటున్నారు. ఇక 2019లో అయితే అమరావతిలో ఏమీ వర్క్ జరగలేదు కాబట్టి వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులు అని ప్రతిపాదించగలిగింది. అయినా సరే న్యాయ స్థానాలలో అది వీగిపోయింది. కానీ ఎంత కాదనున్నా 2029 నాటికి అమరావతి రాజధానికో కీలక ప్రభుత్వ భవనాల నిర్మాణం జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన భూములలో నిర్మాణాలు జరిగితే యాక్టివిటీ స్టార్ట్ అవుతుంది. కానీ ఆ విషయం ఎవరూ చెప్పలేరు కానీ కూటమి ప్రభుత్వం అయితే పట్టుదలగా ఉంది కాబట్టి ఈ విషయంలో కొంత మేర ప్రగతి కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా ముందుకు సాగుతారు తప్ప వెనక్కి వెళ్ళేది ఉండదు, దాంతో రేపటి రోజున వైసీపీకి అధికారం దఖలు పడి ఆ పార్టీ ఎంపీల మద్దతు కేంద్రానికి అవసరం అయినా ఈ విషయంలో మాత్రం కేంద్రం నుంచి సాయం చేసేది ఉండదు, పైగా ఒక చోట రాజధాని అనుకుని కొంత పనులు చేసి మళ్ళీ మారుస్తామంటే జనాలు కూడా నెగెటివ్ అవుతారు అన్నది అంతా గుర్తుంచుకోవాల్సి ఉంది.అయితే వైసీపీ అధికారంలోకి వస్తే మాత్రం మావిగన్ పేరుతో విజయవాడ గుంటూరు, మచిలీపట్నములో కొంత మేర అభివృద్ధి చేయవచ్చు. లేదా ఇంకా ముచ్చట పడితే సీఎం ఆఫీసు కూడా అక్కడ నుంచి నడపవచ్చు కానీ అమరావతి రాజధాని మాత్రం అలాగే చట్టబద్ధతతో ఉంటుంది. పైగా అమరావతిలోనే అన్ని ప్రభుత్వ ఆఫీసులు ఉంటే వేరే చోట నుంచి పాలన జరిపించడం కూడా ఆచరణలో అంత సహేతుకం అనిపించుకోదు. ఏది ఏమైనా మావిగన్ అన్నది ఎండమావిగా మారుతుందా అన్న చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# విదేశాల్లో పర్యటన చేస్తే... అంతరాలయాల్లో పూజలు నిషేధం

విజయవాడ : విదేశీ పర్యటనలు చేసి వచ్చిన అర్చకులు దేవాలయాల్లోని ప్రధాన గర్భాలయాల్లోకి ప్రవేశించి పూజలు నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ శాఖ (ధార్మిక పరిషత్), శృంగేరి శారదా పీఠం గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ నిబంధనల ప్రకారం, విదేశాలకు వెళ్లొచ్చిన అర్చకులు గర్భాలయంలోకి ప్రవేశించడానికి వీలులేదని, ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్‌పై ఉందని ఏపీ కోర్టు పేర్కొంది.విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి చెందిన శ్రీచక్ర నవావరణ అర్చన పారాయణదారు డీఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం సోమయాజి దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. 2010లో దేవాదాయ శాఖ జారీ చేసిన సర్క్యులర్, అలాగే 2024 డిసెంబరులో శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీ భారతీతీర్థ స్వామి వారు విడుదల చేసిన ప్రామాణికమైన మార్గదర్శకాలను ఆలయాల్లో పాటించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కేఆర్ శ్రీనివాస్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటన చేసిన వారిని గర్భాలయ పూజలకు అనుమతించడం ఆచార విరుద్ధమని వాదించారు.శృంగేరి శారదా పీఠం జగద్గురువులు మహాతీర్థ భారతీస్వామి నిబంధనల ప్రకారం, అర్చకులు విదేశాలకు వెళ్లడంపై ఆంక్షలు ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా వెళ్లాల్సి వస్తే, వారు తిరిగి వచ్చిన తర్వాత కేవలం ఆలయం వెలుపల జరిగే పూజలు, వ్రతాలకు మాత్రమే పరిమితం అవుతారు. గర్భాలయంలో పూజలు నిర్వహించే వారు ఖచ్చితంగా త్రికాల సంధ్యావందనం, వేద అధ్యయనం, ఆహార నియమాలతో పాటు కఠిన ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటించాలని శారదా పీఠం గతంలోనే స్పష్టం చేసింది. అదే నిబంధనలు చాలా చోట్ల అమలవుతున్నాయి. విదేశాలకు వెళ్లిన వారు లేదా సంప్రదాయాలకు విరుద్ధంగా జుట్టు కత్తిరించుకున్న వారు (క్షవరం చేయించుకున్న వారు) గర్భాలయ ప్రవేశానికి అనర్హులని కోర్టు గుర్తు చేసింది. ఈ నిబంధనలను తప్పకుండా పాటిస్తామని దేవాదాయ శాఖ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు.

# అమరావతి మార్పు సాధ్యమా..

ఒంగోలు : అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. అందుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందింది. త్వరలో రాష్ట్రపతి సంతకం చేసి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అయితే దీనిపై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆ బిల్లును మార్చేస్తాం అంటూ కామెంట్స్ చేశారు. ఇప్పుడు బిల్లు పెట్టిన మాదిరిగానే.. తాము చేస్తాం అంటూ చెప్పుకొచ్చారు. అప్పటినుంచి ఆయనకు అనుకూలురు సైతం అదే తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే అది సాధ్యమేనా అన్న ప్రశ్నకు కొంతమంది విశ్లేషకుల ముసుగులో సాధ్యమే అని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. అది ప్రజలతో ముడిపడే విషయం కాగా.. మరోవైపు కోర్టు పరిధిలో కూడా ఉంది. ఈ విషయం తెలియక చాలామంది విశ్లేషణల రూపంలో ప్రజల్లో అయోమయాన్ని సృష్టిస్తున్నారు.అమరావతి మార్పు విషయంలో జగన్మోహన్ రెడ్డి చెబుతున్న మాటలను పరిగణలోకి తీసుకుంటే.. ముందుగా ఆయన అంతులేని విజయం సాధించాలి. ఆయనకు అనుకూలమైన ప్రభుత్వం కేంద్రంలో రావాలి. అప్పుడే ఆ బిల్లు మరోసారి మార్పునకు కొంతవరకు అవకాశం ఉంటుంది. అయితే అప్పుడు కూడా అది రాజకీయ అంశంగా మారనుంది. ఎందుకంటే అప్పటికి అమరావతికి ఒక రూపం వస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరుగుతుంది. వాటిని మారిస్తే మాత్రం ప్రజావ్యతిరేకత రావడం ఖాయం. ఎందుకంటే ఏ రాష్ట్రం కూడా రాజధానిని మార్పు చేస్తున్న దాఖలాలు లేవు. కానీ జగన్మోహన్ రెడ్డి పదేపదే రాజధానులను మారిస్తే ప్రజలు ఊరుకోరు. రాజకీయాలు విపరీతంగా ప్రభావితం అవుతాయి కూడా. జాతీయస్థాయిలో జగన్మోహన్ రెడ్డి నవ్వుల పాలవుతారు కూడా. ప్రస్తుతం జగన్ వైఖరి చూస్తుంటే మారుస్తాం అని చెప్పడం లేదు. కేవలం అమరావతి విషయంలో దూకుడుగా ప్రభుత్వం ముందుకెళ్తున్న వేళ.. కొంత రాజకీయ అయోమయం సృష్టించేందుకే ఈ ఎత్తుగడ అని స్పష్టం అవుతుంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో తిరుగులేని విజయం సాధించింది. అప్పుడే అమరావతి స్థానంలో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. కానీ అప్పటికే ఏపీ రాజధాని అమరావతి అని రికార్డుల్లో నమోదయింది. ఆయన మూడు రాజధానుల ప్రయత్నం చేస్తున్న సమయంలోను కేంద్ర ప్రభుత్వ రికార్డుల ప్రకారం అమరావతి రాజధాని అని తేలిపోయింది. మరి అంతటి బలంలో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ఒప్పించలేకపోయారు. పాలన వికేంద్రీకరణ కోసమే తాను మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నానని చెప్పలేకపోయారు. ఎందుకంటే అప్పుడు 22 మంది పార్లమెంట్ సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్నారు. తనకు విలువనిచ్చే ఎన్ డి ఏ ప్రభుత్వం ఉంది. పైగా తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబుకు కేంద్ర పెద్దలు వ్యతిరేకంగా ఉన్నారు. ఆ సమయంలోనే తాను పట్టుబడి తెరపైకి తెచ్చిన మూడు రాజధానులను అమలు చేయలేకపోయారు జగన్మోహన్ రెడ్డి.మరోవైపు న్యాయ చిక్కులను కూడా అధిగమించలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తీసుకున్నప్పుడు ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించారు అమరావతి రైతులు. వారిని ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టారు. కేసులతో ఉక్కిరి బిక్కిరి చేశారు. రాజధాని అంటే ఆ 29 గ్రామాలకు సంబంధించిన అంశంగా భావించారు. కానీ అమరావతి రైతులు న్యాయ పోరాటం చేశారు. ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు డివిజనల్ బెంచ్ అమరావతి రైతులకు అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో ఇష్టపడని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. సుప్రీం కోర్టులో ఆ కేసు పెండింగ్లో ఉంది. కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చట్టపరంగా మూడు రాజధానుల విషయంలో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తించింది. ఎందుకంటే అమరావతి రాజధాని విషయంలో రైతులతో ఒప్పందం ప్రధాన అడ్డంకి కానుంది. అందుకే సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా.. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. కేవలం కోర్టులో ప్రతికూలత వస్తుందని భావించి అప్పట్లో ఆ నిర్ణయం తీసుకుంది.తాజాగా అమరావతికి చట్టబద్ధత అనే అంశం తెరపైకి వచ్చినప్పుడు.. విశ్లేషకుల ముసుగులో కొందరు వైసిపి అనుకూలురు కొత్త ప్రతిపాదన తెచ్చారు. పార్లమెంటులో చట్టబద్ధత కంటే రాష్ట్ర ప్రభుత్వ పరంగా సుప్రీంకోర్టులో ఉన్న కేసును వెనక్కి తీసుకోవచ్చు కదా అనేది వారి సూచన. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే పని చేసింది. అమరావతి ఏకైక రాజధాని అంటూ ఆఫిడవిట్ దాఖలు చేసింది. కానీ సుప్రీం కోర్టులో ఆ కేసు విచారణకు రాలేదు. ఒకవేళ వచ్చినా హైకోర్టు అమరావతికి అనుకూల తీర్పు ఇచ్చిన దృష్ట్యా దానికే కట్టుబడి ఉండాలని ఆదేశాలు ఇస్తుందని న్యాయ నిపుణులు సైతం చెబుతున్నారు. ఒకసారి సుప్రీంకోర్టు ఆ తీర్పు ఇచ్చిందంటే మరోసారి.. అమరావతి రాజధాని మార్పు అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉండదు. అయితే రాజకీయపరంగా చాలా రకాల వ్యాఖ్యలు చేయవచ్చు కానీ.. కొన్నింటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయలేం. ఇప్పుడు అమరావతి విషయంలో జగన్మోహన్ రెడ్డికి ఎదురైన పరిస్థితి అదే. అంతులేని మెజారిటీతో ఆయన గెలవాలి. ఆయనకు అనుకూలమైన కేంద్ర ప్రభుత్వం రావాలి. ఆపై సంకీర్ణ ప్రభుత్వంలో మిగతా రాజకీయ పార్టీలు సహకరించాలి. ఇంత జరిగిన తరువాత మాత్రమే రాజధానిని కదిలించగలరు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇంతకుముందే అంతులేని మెజారిటీతో గెలిచిన ఆయన అమరావతిని అంగుళం కదిపించలేకపోయారు. ఒకవేళ అధికారంలోకి వచ్చినా ఆయన అమరావతిని కొనసాగించాలి తప్ప వేరే ఆప్షన్ లేదన్న టాక్ కూడా ఉంది. సో ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలంతా కేవలం రాజకీయ గందరగోళం కోసమేనని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. అమరావతి శాశ్వతం అంటున్నారు.

# ఆ ఐదుగురు హిట్ లిస్టే...

గుంటూరు: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంగా చెప్పేశారు. తరచూ వివాదాల్లో ఇరుక్కునే ఎమ్మెల్యేలు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే మిగిలిపోతారని చెప్పారు. అంటే ఎమ్మెల్యేలకు స్పష్టంగా చెప్పేశారు. ఏమాత్రం వివాదాల్లో ఇరుక్కున్నా తాను టిక్కెట్ ఇచ్చేది లేదని ఆయన చెప్పకనే చెప్పారు. ఇప్పటికిప్పుడు చర్యలు ఉండకపోవచ్చు. కానీ భవిష్యత్ లో మాత్రం వారికి టిక్కెట్ ఇచ్చే విషయంలో ఈ వివాదాలన్నీ కౌంట్ అవుతాయని చంద్రబాబు ఎమ్మెల్యేలకు చెప్పకనే చెప్పేశారు. ఎన్ని సార్లు చెప్పినప్పటికీ వారు చెవికెక్కించుకోకపోవడంతో పాటు ఇంకా ఎమ్మెల్యేలు రెచ్చిపోతుండటంతో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు.ఇటీవల టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు వరస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. అనేక మంది అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇప్పటి వరకూ చాలా మంది ఎమ్మెల్యేలు గీత దాటినట్లు చంద్రబాబుకు స్పష్టంగా అర్థమయింది. వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ అయితే తీసుకున్నారు కానీ, సస్పెండ్ చేయలేదు. సస్పెండ్ చేయకపోనంత మాత్రాన చేతకాని తనం అని చూస్తూ ఊరుకోవద్దని అన్నారు. గీత దాటితే ఖచ్చితంగా సస్పెండ్ చేస్తామని చెప్పారు.అలాగే వైఖరి కొనసాగితే సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని హింట్ ఇచ్చారు.తిరువూరుఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్, నరసరావు పేట ఎమ్మెల్యే అరవింద బాబు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం లుమాత్రం ట్రబుల్ లో ఉన్నట్లేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వెను వెంటనే వీరిపై చర్యలు తీసుకోకపోయినప్పటికీ వచ్చే ఎన్నికల్లో వీరి స్థానంలో కొత్త నేతలకు అవకాశం ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయినట్లు తెలిసింది.ఎవరు తోక జాడించినా.. ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం లేదు కానీ, వచ్చే ఎన్నికల్లో మాత్రం టిక్కెట్ లభించదన్నది స్పష్టంగా చెప్పినట్లయింది. ఇప్పటికైనా ఎమ్మెల్యేల్లో మార్పు వస్తుందా? లేదా?అన్నది చూడాల్సి ఉంది.

కాఫీ కబుర్లతో ఆకట్టుకుంటున్నలోకేష్

కాఫీ కబుర్లు' పేరుతో టిడిపి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోంది. టిడిపి కేంద్ర కార్యాలయంలో గత కొన్ని రోజులుగా పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలకు, అదే విధంగా క్లస్టర్ ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి.. ప్రత్యర్థుల పై ఏ విధంగా పై చేయి సాధించాలి... అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లే విషయంపై తర్ఫీదు ఇస్తున్నారు. చంద్రబాబు సహా మంత్రి లోకేష్ తీసుకువస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లే అంశాలపై ఏ విధంగా ప్రచారం చేయాలని అంశాలను వారికి వివరిస్తున్నారు. తద్వారా వచ్చే ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీని గెలుపు గుర్రం ఎక్కించడమే లక్ష్యంగా ఈ శిక్షణ జరుగుతోంది. దీనిలో భాగంగా 'కాఫీ కబుర్లు' అనే పేరుతో వినూత్న కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నారు.. దీనిని ప్రధానంగా ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు, అదేవిధంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో నారా లోకేష్ రెండుసార్లు పార్టీ కార్యాలయానికి వచ్చారు. చంద్రబాబు సైతం రెండుసార్లు పార్టీ ఆఫీస్ కి వచ్చారు. ఈ సందర్భంగా 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు, పార్టీలో నాయకులకు –కార్యకర్తలకు మధ్య ఉన్న రిలేషన్ అడిగి తెలుసుకుంటున్నారు. ఏవిధంగా ముందుకు సాగాలి. ఉన్నత స్థాయి ప్రజల నుంచి క్షేత్రస్థాయిలో సాధారణ ప్రజల వరకు పార్టీని ఏ విధంగా ముందుకు నడిపించాలనే అంశంపై వారు చర్చిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చిత్రమైన విషయం ఏమిటంటే అందరితోపాటు కూర్చుని కాఫీ తాగుతూ వారితో ముచ్చటించడం. ఎవరు ఏం చెప్పినా వినే అవకాశం ఇవ్వడం... ప్రధానంగా కార్యకర్తలను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో వ్యక్తిగత అంశాలకు కూడా ప్రాధాన్య ఇస్తున్నారు. కొంతమంది కార్యకర్తలు తమ కుటుంబాలకు సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావిస్తుంటే ఓపికగా వింటున్నారు. పార్టీ పరంగా అయితే వారు చెప్పింది వింటూనే మరికొన్ని సలహాలు సూచనలు ఇస్తున్నారు. మొత్తంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమం టిడిపిలో ఒక ఆసక్తికర పరిణామంగా మారింది. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం పట్ల ఆసక్తి నెలకొంది. ఈ తరహా కార్యక్రమం నిర్వహించడం టిడిపికి ఇదే తొలిసారి. గతంలో బిజెపి 'చాయ్ పే చర్చా' వంటి కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. అదే తరహాలో టిడిపి కాఫీ కబుర్లు పేరుతో కార్యక్రమాన్ని ఎంచుకుని నిర్వహించడం ద్వారా కార్యకర్తలకు మరింత చేరువ అయ్యేలా వ్యవహరిస్తోంది.

# టీడీపీకి మరింత మంది మహిళా లీడర్లు

కాకినాడ : టీడిపికి మరింత మంది మహిళలు అవసరం అవుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం పార్టీలో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు పార్టీ అధినేత సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే ఏర్పాటు చేయనున్న రాష్ట్రస్థాయి కమిటీలో మహిళల రిజర్వేషన్ పెంచాలని భావిస్తున్నారు. తద్వారా 33% మేరకు పార్టీ పదవుల్లో ముఖ్యంగా రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళలకు అవకాశం దొరుకుతుంది. ఇది ఒక రకంగా పార్టీ ఆవిర్భావం తర్వాత సంచలన నిర్ణయం అనే చెప్పాలి. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళా నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ఇప్పుడు 33 శాతం మందిని ఖచ్చితంగా నియమించాలని పార్టీ నిర్ణయించింది. తద్వారా మెజారిటీ మహిళ నాయకులకు రాష్ట్రస్థాయి కమిటీలో అవకాశం దొరుకుతుంది. మరోవైపు నియోజకవర్గాల సంఖ్య పెరిగితే.. మహిళా నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కూడా మరింత మంది మహిళ నాయకులు అవసరం ఏర్పడుతుంది. దాదాపు 80 నియోజకవర్గాలపైగా మహిళలకు కేటాయిస్తారన్న చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఆమేరకు మహిళా నాయకత్వాన్ని పెంచుకునేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. దీనికి ప్రధానంగా రెండు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని సమాచారం. 1) సంస్థా గతంగా పార్టీలో ఉన్న మహిళా నాయకులు. అదేవిధంగా వారసత్వంగా పార్టీకి సేవ చేస్తున్న నేతలు. 2) యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో పార్టీ వేస్తున్న అడుగులు, తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ఆకర్షితులవుతున్న యువతులను పార్టీలోకి తీసుకుని వారికి పదవులు కట్టబెట్టాలని భావిస్తోంది, అయిన ప్పటికీ నాయకత్వం పరంగా చూసుకున్నప్పుడు మహిళల సంఖ్య తక్కువగా ఉంది. ఈ క్రమంలో మహిళా నాయకత్వాన్ని పెంచుకునే దిశగా ఏ విధంగా ముందుకు సాగాలి.. ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలి.. అనే విషయంపై చంద్రబాబు పార్టీ సీనియర్లకు బాధ్యతలు అప్పగించారు. ఎవరిని పడితే వారిని కాకుండా పార్టీకి సంస్థగతంగా ఉండేలాగా సామాజిక వర్గాలపరంగా అదే విధంగా బడుగు బలహీనవర్గాల నుంచి కూడా మహిళా నాయకులను తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో బీసీలు ఎక్కువ మంది ఉండేలా చూడనున్నారు. ఎందుకంటే ఆది నుంచి టిడిపి బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో వారి తరఫున బలమైన గళం వినిపించే మహిళా నాయకులకు ఇప్పుడు అవకాశం దక్కనుంది. మొత్తంగా టిడిపికి మరింత మంది మహిళా నాయకుల అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

రాయపాటి అరుణకు చాన్స్

రాజధాని అమరావతి ఉద్యమకారిణిగా గుర్తింపు సాధించి కూటమి ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన రాయపాటి శైలజ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయనున్నారా? ఆమెను పార్టీలో చేర్చుకుని రాజధాని ప్రాంతంలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీకి నిలపాలని టీడీపీ అధిష్టానం భావిస్తోందా? ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తే ఈ అనుమానాలు నిజమయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారని, దీంతో కొత్తగా సమర్థులైన మహిళా నేతలను రంగంలోకి దింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని అంటున్నారు.

రాజకీయ నేపథ్యం నుంచి వచ్చినప్పటికి రాయపాటి శైలజకు ఇప్పటివరకు ఏ పార్టీతో సంబంధం లేదని అంటున్నారు. గతంలో అమరావతి రాజధానిని కాపాడుకునేందుకు రైతులు చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపిన శైలజ టీడీపీ అధిష్టానం దృష్టిని ఆకర్షించారని చెబుతున్నారు. ఆమె కుటుంబానికి టీడీపీతో అనుబంధం ఉన్నప్పటికీ శైలజ మాత్రం ఆ పార్టీ తరఫున ఇప్పటివరకు పనిచేయలేదని, కేవలం అమరావతి ఉద్యమం వరకు పరిమితమయ్యారని అంటున్నారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాజధాని ఉద్యమం కూడా ఒక కారణంగా భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పట్లో ఉద్యమంలో ముందుండి నడిపిన రాయపాటి శైలజ తెగువను మెచ్చుకుని మహిళా కమిషన్ గా నియమించారు. ఇక ఇప్పుడు కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు అవుతుండటం, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాల్సివుండటంతో రాయపాటి శైలజను పార్టీలోకి తీసుకువచ్చి ఆమె సేవలను రాజకీయంగా వాడుకోవాలని టీడీపీ హైకమాండ్ భావిస్తోందని అంటున్నారు. ప్రస్తుతం మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా ఉన్న రాయపాటి శైలజ పదవీకాలం రెండేళ్లు మాత్రమే ఉంటుందని చెబుతున్నారు.

# ఉప్పగుంట పల్లెలో వెలుగు చూసిన చారిత్రక సంపద

## - 17వ శతాబ్దం నాటి చాముండి విగ్రహం వెలుగులోకి...

కడప : మైదుకూరు మండలం ఉప్పగుంటపల్లె లో దశరథ రామిరెడ్డి, సుధాకర్ రెడ్డి పొలాల్లో నాగులపుట్ట వద్ద పెద్దిరెడ్డి శివశంకర్ రెడ్డి నీటితో శుభ్రం చేస్తుండగా 17వ శతాబ్దం నాటి చాముండి విగ్రహం బయలు పడి,వెలుగులోకి వచ్చినట్టు రచయిత చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మీడియాకు తెలిపారు.

చండ, ముండ అనే ఇద్దరు రాక్షసులను తన ఖడ్గంతో సంహరించడంతో ఆమెకు చాముండి (చాముండేశ్వరి) అను పేరు వచ్చిందని చెప్పారు. ఈమె పార్వతీదేవి ఉగ్ర అవతారమని,సప్తమాతృకలలో ఒకరిని, ప్రత్యేకమని తెలిపారు. శిల్ప వర్ణన.....ఈ విగ్రహంలో చాముండేశ్వరి దేవి సుఖాసనములో (ఒక కాలు ఆసనముపై పరుండబెట్టి మరియొక కాలు సుఖంగా క్రిందికి విడవడం) కూర్చొని ఉందని చెప్పారు. కుడికాలు క్రింద ఒక తల, ఎడమ కాలు కింద రెండు తలలు (ముండా అనే రాక్షసుని) ఉన్నాయన్నారు. తలపై కిరీటం, కళ్ళు పెద్దవిగా, ముక్కునొక్కుపోయినట్లుగా, చెవులకు పెద్దపెద్ద లోలాకులు ధరించి ఉందని వివరించారు. మెడలో కంటె,శేరు ధరించినట్లు, స్థనాలను ప్రస్ఫుటంగా శిల్పీకరించారు.

ఉదరం బక్క చిక్కినట్లుగా, (సింహ మధ్యమం) సన్నని నడుంఅద్భుతంగా చెక్కారన్నారు. ఉదరం నుంచి పిక్కల వరకు అర్థచంద్రాకృతిలో ఉన్న వస్త్రాలను ధరించినట్లుందని తెలిపారు. కుడివైపు పై చేతిలో ఢమరుకం కింది చేతిలో ఖడ్గం, ఎడమ వైపు కింది చేతితో రాక్షసుని తల కేశాలను పట్టుకున్నట్లుగా, పై చేయి లో త్రిశూలం పట్టుకున్నట్లుగా చూపరులను ఆకర్షించే విధంగా చిత్రీకరించారన్నారు. చేతులలో కేయురాలు, ముంజేతి వలయాలు ఉన్నాయని చెప్పారు.

స్థానిక ఆచారాలు.... నెల్లూరు జిల్లాలోని పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి తిరుణాల మరుసటి దినం పౌర్ణమి రోజున ఉప్పగుంటపల్లె మొలకల (కుంపటిలో సొద్దులు ,జొన్నలు, ఉలవల విత్తనాలు మొలకెత్తడం) పండుగ జరపడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.ఇక్కడ చాముండి దేవత ఉందని మాకు తెలియదని గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

×స్థానిక కథ .....

పెద్దిరెడ్డి అబ్బిరెడ్డి ఇంట్లో తిరుమల రామయ్య యాదవ్ పాలేరుగా పనిచేసే వారన్నారు. ఇతనికి ఒక రోజు పెంచలకోనల లక్ష్మీనరసింహస్వామి ఒళ్ళలోకి రావటంతో అబ్బిరెడ్డి ఇంట్లో దేవుని మూల లో ఇసుకను ఏర్పాటు చేశాక ఆ ఇసుకలో స్వామి పాదాలు పడ్డాయని గ్రామస్తులు కథలుగా చెబుతున్నారని రచయిత వివరించారు.

## గుమ్మడిదల సర్వే నెంబర్ 109 రైతులకు వంద గజాల స్థలం ఇవ్వాల్సిందే..

**అన్నారం రైతుల భూములు లాక్కుంటే ఉద్యమమే..**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

పటాన్ చేరు ఏప్రిల్ 07 (ప్రజా కలం) ప్రతినిధి

రైతు ప్రభుత్వం అంటూ ప్రగల్బాలు పలుకుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. గుమ్మడిదల, అన్నారం రైతుల విషయంలో పక్షపాత వైఖరిని అవలంబిస్తూ.. వారి పాలిట ఆశనిపాతంగా మారుతోందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నంబర్ 109 లో గల 140 మంది రైతులకు సంబంధించిన 160 ఎకరాలను గత సంవత్సరం టీ జి ఐ ఐ సికి ప్రభుత్వం కేటాయించింది. ఆ సమయంలో నష్టపరిహారంతో పాటు



100 గజాల ఇళ్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చిన.. నేటి వరకు అమలుకావడం లేదంటూ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులు మంగళవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారుఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ భూములు సేకరించే సమయంలో అప్పటి కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు భూములు కోల్పోయిన 140 మంది రైతులకు 100 గజాలు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిందేనని అన్నారుఇళ్ల స్థలాల కోసం 5 ఎకరాలు సైతం ప్రత్యేకంగా కేటాయించారని రైతులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు ఈ అంశంపై జిల్లా కలెక్టర్ తో చర్చించి.. ప్రతి రైతుకి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా అన్నారం పరిధిలోని సర్వేనెంబర్ 261లో 117 మంది పేద రైతులకు సంబంధించిన 117 ఎకరాల అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, షేక్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ ఉమామహేశ్వర బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో

గజ్వేల్:07ఏప్రిల్ 2026ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర బ్రహ్మోత్సవ భక్తోత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈవో శశిధర్, ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో



ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవ భక్తోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో శశిధర్, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 9వ తేదీన స్వస్తి వాచనంలతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 10న వాసుదేవ పుణ్యాహవాచనము,అంకురార్పణ,యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, బేరి పూజ, 11 తేదీన స్వామివార్ల ఎదుర్కోళు ,, సీతారామ ఉమామహేశ్వర కళ్యాణం, 12న పోన్న సేవ, నంది వాహన సేవ, భద్రకాళి పూజ, 13న అగ్నిగుండాలు, గరుడసేవ, కొనసాగి 14వ తేదీన స్వామివారి పుష్ప రథోత్సవం, పూర్ణాహుతి, చక్రతీర్థం, పుష్పయాగంతో ముగుస్తాయని తెలిపారు. ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మదన్మోహన్ రెడ్డి, కమిటీ సభ్యులు జితేందర్ రావు, చిలివేరి జనార్ధన్, రామాలయం ప్రధాన అర్చకులు బీటుకూరి శ్రీనివాసచార్యులు, శివాలయం అర్చకులు మఠం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధి వినాయక దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు

మల్కాజిగిరి,ఏప్రిల్07(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి యాదవ్ నగర్‌లో వెలసిన శ్రీ సిద్ధి వినాయక దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. భక్తుల కోరికలను నెరవేర్చే ఆలయంగా ఈ దేవాలయానికి మంచి పేరుపొందింది. 2005 సంవత్సరంలో ఈ ప్రాంతంలో ఒక వ్యక్తి ఇల్లు నిర్మించేందుకు పునాదులు తవ్విస్తున్న సమయంలో శ్రీ సిద్ధి వినాయకుడి విగ్రహం లభించడంతో, కాలనీవాసులు కలిసి ఆలయాన్ని నిర్మించి అప్పటి నుంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు పూజారి తెలిపారు. ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



# సామాన్యుడి ధైర్యం.. సమాచార హక్కు చట్టం

**-రాష్ట్రస్థాయి సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అవగాహన సదస్సు రవీంద్ర భారతిలో నిర్వాహణ**

**-ప్రజల్లో చైతన్యం పెంచేందుకు మీడియా ఎన్జీవోల పాత్ర కీలకం**

**సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ మాజీద్ అలీ**



పటాన్ చేరు ఏప్రిల్ 07 (ప్రజా కలం) ప్రతినిధి

సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) సామాన్యుడికి కొండంత ధైర్యమని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ మాజీద్ అలీ అన్నారు. హైదరాబాదులోని రవీంద్ర భారతి లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్,రాష్ట్ర అధ్యక్షులు సూర్య స్రవంతి చేతుల మీదుగా సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి నియామక పత్రాన్ని అందించారు. అనంతరం మాజీద్ అలీ మాట్లాడుతూ పారదర్శకమైన పాలనకు ఆర్టిఐ ఉపయోగపడుతుందన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వ పాలనలో ఎలాంటి రహస్యాలు ఉండకూడదని తెలిపారు. సమాచార హక్కు చట్టం మాత్రమే కాదు-పాలనలో పౌరులు భాగస్వామ్యం కావడం అని అభిప్రాయపడ్డారు. ఈ చట్టాన్ని వ్యక్తిగత అవసరాలకు కాకుండా.. సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని అన్నారు.

2005లో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందని,దీనితో పాలనలో పారదర్శకత పెరిగిందని చెప్పారు. జవాబుదారీతనం పారదర్శకంగా పనిచేసేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరే సమాచారాన్ని అందించడంలో పీఐవో, ఏపీఐవో ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు కోరిన సమాచారం అందించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం 2005 లోని అంశాలు, ఆర్టిఐ దరఖాస్తు విధానం, దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తు ఫీజు, ఇవ్వాల్సిన సమాచారం, పీఐవో, ఏపీఐవో ల బాధ్యతలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర్య స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగటి రాజ్ కుమార్, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసుల ప్రత్యేక చర్యలు.

**నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో సమీక్ష సమావేశం.**

**ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు, సైన్ బోర్డుల ఏర్పాటు పై దృష్టి.**

**ట్రాఫిక్ నిబంధనలు పాటించి, సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు విజ్ఞప్తి:**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్..**

సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్0 7 (ప్రజా కలం):

సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి: జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్ ఎచ్ ఐ అధికారులతో మునిపల్లి టోల్ ప్లాజా వద్ద మంగళవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించి, జాతీయ రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలపై సమగ్రంగా చర్చించారు. ప్రమాదాలకు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి, ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు (సైన్ బోర్డులు), స్పీడ్ లిమిట్ సూచనలు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ఇంజనీరింగ్ లో లోపాలు ఉన్నట్లయితే మరమత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అదేవిధంగా, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అధిక వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌ను నివారించాలని సూచించారు. ప్రతి



ఒక్కరూ రోడ్డు భద్రతపై జాగ్రత్తలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మేనేజర్ శివ ప్రకాష్, ఇండిపెండెంట్ ఇంజనీర్ సంజోగ్ డోంగ్రే, దక్కని టోల్వేస్ ప్రైవేట్ లిమిటెట్ ప్రాజెక్ట్ హెడ్ ప్రవీణ్ దూబే, ఐఐటి రోడ్డు ఇంజనీరింగ్ ఎక్సపర్ట్ దిగ్విజయ్, సంగారెడ్డి డిఎస్పీ సత్యయ్య గౌడ్, జహీరాబాద్ డిఎస్పీ సైదా నాయక్, ఇన్స్పెక్టర్స్ వెంకటేశ్, రామకృష్ణ రెడ్డి, శివలింగం, సుమన్ కుమార్, ఎస్పీ లు రాజేష్ నాయక్, వినయ్, కాశినాథ్, రాజేందర్ రెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక అగ్నిమాపక భద్రత తనిఖీలు.

**- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి. నాగేశ్వరరావు.**

సంగారెడ్డి, ప్రతినిధి ఏప్రిల్ 07 (ప్రజా కలం):

తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని పరిశ్రమలు, నివాస, విద్యా, వాణిజ్య మరియు ఇతర సంస్థలలో అగ్నిమాపక భద్రత ప్రమాణాల అమలు పై ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రతి వారం ముందస్తు సమాచారం ఇచ్చి సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, నేషనల్ బిల్డింగ్ కోడ్ ప్రకారం అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, నిర్వహణ, సక్రమ పనితీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నామని తెలిపారు.



అందులో భాగంగా మంగళవారం పటాన్‌చెరు స్టేషన్ అగ్నిమాపక అధికారితో కలిసి పటాన్చెరు,ఐడీఏ పశామైలారం లోని ఎం/ఎస్ న్యూల్యాండ్ లాబొరేటరీస్ లిమిటెడ్, యూనిట్-II, ఎం/ఎస్ క్రామ్సన్ రీసెర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల సందర్భంగా సంబంధిత సంస్థల సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సంబంధిత సంస్థలు నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు అనుగుణంగా అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసినట్లు గమనించామని, అయితే కొన్ని పరికరాలు పనిచేయకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడం వంటి లోపాలు గుర్తించి, అట్టి లోపాలను వెంటనే సరిదిద్దాలని, అన్ని పరికరాలు ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలను ఆదేశించామని తెలిపారు. అదేవిధంగా, అగ్నిమాపక భద్రత ప్రమాణాలు పూర్తి స్థాయిలో అమలు చేసిన తర్వాత అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం ఫైర్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు అగ్నిమాపక భద్రత పట్ల అవగాహన పెంచడం, ప్రాణాలు, ఆస్తులు మరియు మౌలిక సదుపాయాలను రక్షించడం ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లాలో అగ్నిమాపక భద్రత నియమాలు కచ్చితంగా అమలవుతున్నాయో లేదో నిర్ధారించేందుకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.

# గులాబీని కబళిస్తున్న కాళేశ్వరం

కరీంనగర్ : తెలంగాణ గర్వకారణంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరం ప్రస్తావన తీసుకువచ్చారు. వారికి ఇదే సరైన చాన్స్ అనిపించింది. మూడు రోజుల కిందట కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ గట్టి కౌంటర్ ఇచ్చారు కాళేశ్వరం పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, ప్రజలకు అందాల్సిన నీరు అందకుండా పోయిందని కేంద్రం స్పష్టం చేయడం బీఆర్ఎస్ వర్గాలను గ్భ్రాంతికి గురిచేసింది. దాంతో పార్లమెంట్లో అమరావతి అంశంపై చర్చలోతమ ఆక్రోశాన్ని వెలిబుచ్చారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుండి కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని పిలుస్తూ వస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటంతో ఆయన చేస్తున్న విమర్శలకు ఇప్పుడు కేంద్ర మంత్రి వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి.

లక్ష కోట్ల వ్యయం చేసినా ఫలితం శూన్యమని కేంద్రం సాక్షాత్తూ పార్లమెంటులో ప్రకటించడం ద్వారా.. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ రెండు పార్టీలు బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని జాతీయ స్థాయిలో ముద్ర వేసినట్లయింది. ఇది బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడుపడని పరిణామంగా మారింది.రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీల నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ఒక ఏటీఎం లాగా వాడుకుందని ఆయన విమర్శించారు.

## రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు.

సిద్ధిపేట ప్రజాకలం ఏప్రిల్ 07.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ప్రతిష్టాత్మక పురస్కారాలలో భాగంగా సిద్ధిపేట జిల్లా రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించడం గర్వకారణమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ పేర్కొన్నారు. హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మహారాజ్ ఈ అవార్డును మంగళవారం స్వీకరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, తల్లి-శిశు సంరక్షణ, ప్రసూతి సేవలు, సాధారణ వైద్యం, వ్యాధి నిరోధక కార్యక్రమాలు వంటి అనేక రంగాలలో విశేష ప్రతిభ కనబరిచినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అవార్డు సిద్ధిపేట జిల్లాకు రావడం ఎంతో ఆనందదాయకమని, ఇది జిల్లాలోని వైద్య సిబ్బంది అంకితభావానికి నిదర్శనమన్నారు. రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందిస్తున్న సేవలు ఇతర కేంద్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. అవార్డు స్వీకరించిన డాక్టర్ మహారాజ్ మాట్లాడుతూ ఈ పురస్కారం తన ఒక్కరి కృషి ఫలితం కాదని, ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలు మరియు ఇతర సిబ్బంది సమిష్టి కృషి వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందని చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రస్థాయి అవార్డు రావడం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డిప్యూటీ వైద్యాధికారి ఎం.శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ అశ్లేష, లింగారెడ్డిపల్లి సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పి ప్రియాంక, స్థానిక ఏఎన్ఎమ్ ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు కొండంత అండ.

సిద్ధిపేట ప్రజాకలం ఏప్రిల్ 07.

పేద ప్రజలకు ఆపదలో సీఎం సహాయ నిధి పథకం ఎంతో ఆసరాగా ఉంటుందని కష్టకాలంలో వైద్య ఖర్చులకు ఉపయోగకరంగా ఉంటుందని బిజెపి సీనియర్ నాయకులు మాదాస్ వెంకట్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి



చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి పథకం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు గొప్ప ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఈ పథకాలు అర్హులైన వారికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అనాజీపూర్ గ్రామానికి చెందిన మత్తమల్ల రాంచంద్రంకు రూ.75,500 విలువైన సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సహకారంతో సీఎం సహాయనిధి చెక్ అందజేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

**- సంగారెడ్డి తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ.**

సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 07( ప్రజా కలం):

తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఎన్ఎస్ఎస్ విభాగాలు మరియు జీవశాస్త్ర విభాగము ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు. పౌరులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా పనిచేయడం వల్ల ఉత్పాదక శక్తి పెరిగి దేశ అభివృద్ధి జరుగుతుందని తెలిపినారు. భారతదేశ జనాభాలో అత్యధిక జనాభా పౌష్టిక ఆహార లోపంతో బాధపడుతున్నారని, ముఖ్యంగా స్త్రీలు, బాలికలు సరియైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవటం లేదని, పౌష్టిక ఆహారము తీసుకొనక పోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కళాశాల విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళల్లో న్యూట్రీషన్ సమస్య ఉన్నదని, అనేక కారణాలవల్ల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు లభ్యం కావడం లేదని, పౌష్టిక ఆహారము బాలబాలికలకు అందించవలసిన బాధ్యత మన అందరిపై ఉందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపినారు. అనంతరం కళాశాల బాలికలకు ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించుటకు ప్రయత్నించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ జోష్ణ, డాక్టర్ సదయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## సబితా ఇంద్రారెడ్డి పి ఏ మాతృమూర్తి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 07, (ప్రజా కలం)

మాజీ మంత్రి పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకులు శ్రీనివాస్ మాతృమూర్తి అచ్చిమ్మ స్వర్గస్తులైనారు అనే విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి సబితా ఇంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో భువనగిరి పార్లమెంటు బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కందుకూర్ లో ఘోర రోడ్డు ప్రమాదం

**కారు ను ఢీ కొట్టిన డీసీఎం వాహనం ఒకరు మృతి**

**కారులో ఒకే కుటుంబానికి చెందిన 5 గురు**

**గాయపడి చికిత్స నిమిత్తం మాధవంజి ఆసుపత్రికి తరలింపు**

**కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్న కందుకూరు పోలీసులు**

మహేశ్వరం, ఏప్రిల్ 07, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో నవర్ బాల్ రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. కందుకూరు వైపు వెళున్న కారు (మొత్తం ఐదుగురు ప్రయాణికులతో)ను హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి కారు ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కందుకూరు గ్రామానికి చెందిన సురసాని



భారత్ రెడ్డి (30) తీవ్ర గాయాలతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. కారు లోని మిగిలిన నలుగురు ప్రయాణికులు సురసాని రవీందర్ రెడ్డి (47), సురసాని స్వాతి (42), సురసాని అవినాష్ రెడ్డి (17), సురసాని తేజశ్రీ (15) గాయపడి చికిత్స నిమిత్తం మాధవంజి ఆసుపత్రికి తరలించారు. డీసీఎం వాహనం డ్రైవర్‌ను గుర్తించగా, ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని కందుకూరు పోలీసులు తెలిపారు.



## 10 మంది అధికారులు ఒకేసారి సస్పెండ్ కావడం

# చరిత్రలో తొలిసారి

**- సస్పెండ్ అయిన అధికారులు నోరు విప్పాలని బిజెపి వినూత్న నిరసన**

**- అవినీతిని వెలికి తీసిందే భారతీయ జనతా పార్టీ**

**- అవినీతికి పాల్పడిన ఏ ఒక్క రాజకీయ నాయకుడిని వదిలిపెట్టకూడదు**

**- బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా**

**- బడంగ్‌పేట్ బీజేపీ క్లస్టర్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి**



మహేశ్వరం, ఏప్రిల్ 07, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ సర్కిల్‌లో వెలుగులోకి వచ్చిన 150 కోట్ల భారీ అవినీతి కుంభకోణం రాష్ట్రాన్ని కుదిపేస్తోందని బీజేపీ నేతలు మండిపడ్డారు. డిప్యూటీ కమిషనర్‌తో పాటు పదిమంది అధికారులు సస్పెండ్ కావడం ఈ అవినీతి ఎంత విస్తృతంగా జరిగిందో స్పష్టంగా చూపిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో బడంగ్‌పేట్ బీజేపీ క్లస్టర్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ అవినీతి కేవలం అధికారుల పని కాదు దీని వెనుక బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన పెద్దల రాజకీయ ఆశీర్వాదం ఉంది. అసలు నేరస్థులు బయటపడాలి" అని డిమాండ్ చేశారు. బీజేపీ కార్పొరేటర్లు ఈ అవినీతిలో ఉన్నారని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ -- "దోషులు బయటపడతారనే భయంతో బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు" అని విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా బడంగ్‌పేట్ నగర పంచాయతీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ దాకా అవినీతి నిరాటంకంగా కొనసాగుతూనే ఉందని, ఈ దోపిడీపై మొదటి నుంచి బీజేపీనే పోరాటం చేస్తోందని తెలిపారు. ఇకపై ఈ పోరాటం మరింత తీవ్రంగా ఉంటుందని, అవినీతి చేసిన ఒక్క నాయకుడినైనా వదిలిపెట్టమని స్పష్టం చేశారు. బడంగ్‌పేట్ సర్కిల్‌లో కాంట్రాక్టర్లు పని చేయకుండానే టెండర్లు మంజూరు చేసి కోట్ల రూపాయలు దోచుకున్నారని, బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పాత బాత్రూంలకు పైపై మరమ్మతులు చేసి రూ.40 లక్షలు మింగేశారని ఆరోపించారు. "ఈ అవినీతి బాగోతం బయటపడటానికి బీజేపీ ఇచ్చిన ఫిర్యాదులే కారణం. లేదంటే ఈ దోపిడీ ఇంకా కొనసాగుతూనే ఉండేది" అని ఆయన పేర్కొన్నారు. ఈ కేసును సిట్/సిబిఐతో విచారణ చేయాలి సంబంధిత రాజకీయ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి ప్రజల డబ్బు పూర్తిగా రికవరీ చేయాలి అని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుందిఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి,గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్,క్లస్టర్ 2 అధ్యక్షులు వీర కర్ణ రెడ్డి,మీర్పేట్ క్లస్టర్ వన్ అధ్యక్షులు బిక్షపతి చారి, మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ , సీనియర్ నాయకులు సామ సంజీవరెడ్డి నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, పి. శ్రీనివాస్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి,రేసు నరసింహారెడ్డి, నీల రవి నాయక్, ఐలేష్ యాదవ్,మధుసూదన్ రెడ్డి, లక్ష్మణ్,అంజిరెడ్డి పుల్లారెడ్డి నిమ్మల రవికాంత్ గౌడ్, లోకం ముదిరాజ్ , లాలా సందీప్,రమావత్ రవి నాయక్, రవీందర్ రెడ్డి,మురళీధర్ రెడ్డి, శురకర్ణ రెడ్డి,మంత్రి కృష్ణ, మారుతి రెడ్డి, పోరెడ్డి నితిన్, బంగారు రాహుల్,భరత్ మంత్రి శ్రీధర్ రామాచారి యాదిరెడ్డి అరవింద్ మల్లేష్ ఆంజనేయులు కిరణ్ రాజ్ పాశం శివ బడంగ్పేట్ సర్కిల్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి స్వాగతం పలికిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 07,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



టియూఎఫ్ఐడి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి అధ్యక్షతన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ,ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సవత్ ,ఏఐసీసీ, సి డబ్ల్యూ సి చల్లా వంశీచందర్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణ రావు కి నాగర్ కర్నూలు జిల్లా నూతన కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశానికి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్తున్న సందర్భంగా తుక్కుగూడ దగ్గర ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమం లో టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఏనుగు జంగారెడ్డి,జడ్పీ చైర్పర్సన్ తీగల అనిత రెడ్డి ,మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి , ఆవుల యాదయ్య, నవీన్ గౌడ్, మండల అధ్యక్షులు కాకి ఈశ్వర్, కోటగళ్ల రాజు అజయ్, రెడ్డి గళ్ళ అజయ్, అభి, ఆదిల్ల జంగయ్య, అబ్దుల్ బారి, ప్రశాంత్, కప్పల రాజు,తదితరులు పాల్గొన్నారు.

## వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన పార్టీ ఎర్రజెండా

**బాలాపూర్ ఇంటింటి సిపిఐ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి**

**బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి**

మహేశ్వరం, ఏప్రిల్ 07,(ప్రజా కలం)

వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన పార్టీ ఎర్రజెండా అని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి, బాలాపూర్




మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఇంటింటి సిపిఐ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన ఎర్రజెండా పార్టీ ప్రజల మధ్యన ఉండే సి.పి.ఐ పార్టీ ఇంకా వంద సంవత్సరాలు అయిన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఈ దేశంలో పేద ప్రజలకు కొరకు కొట్లాడే పార్టీ ఒకే ఒక్క పార్టీ సిపిఐ పార్టీని పేదవాడు ఎక్కడ కార్మికుడు ఎక్కడ కర్షకుడు ఎక్కడ నిరుపేదవాడు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్రజెండా పార్టీ పేదల పక్షాన నిలుస్తుంది అలాంటి పార్టీ ఇంటింటి సర్వే చేపట్టి గడప గడపలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని ముందుకు సాగుతున్న పార్టీకి ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ రావడం మాకెంతో ఉత్సాహాన్ని ఇస్తుందని కామ్రేడ్ రవీంద్ర చారి అన్నారు.

## గ్రామాల్లో గంజాయి, బెల్ట్ షాపుల నివారణకు చర్యలు తీసుకోవాలి

**ఫ్యూచర్ సిటీ ఏసీపీ ని కలిసిన మహేశ్వరం, కడ్తాల్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర గణేష్**



మహేశ్వరం, ఏప్రిల్ 07, (ప్రజా కలం)

గ్రామాల్లో యువత గంజాయి మత్తుకు బానిసై ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, అక్రమ గంజాయి రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసులను కోరారు. మహేశ్వరం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎర్ర గణేష్, కడ్తల్ మండలం ఎమ్మార్పీఎస్ నాయకుడు అబ్బు రమేష్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మహేశ్వరం ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ ఏసీపీ జానకి రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోకి అక్రమంగా గంజాయి సరఫరా జరుగుతోందని, దీనివల్ల యువత దారి తప్పుతున్నారని తెలిపారు. గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, గ్రామాల్లో నడుస్తున్న బెల్టు షాపులపై కూడా కఠినంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా సాయంత్రం సమయాల్లో గ్రామాల్లో యువతకు గంజాయి ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోలీసులు మరియు స్థానిక నాయకులు కలిసి చైతన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాసప్ప గారి కిరణ్, విజేందర్ , కె, మహేశ్, ఎర్ర స్వామి, బొల్లెపాక యాదయ్య, ఎర్ర సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాల పార్టీకి ప్రజల అండ. బూర్జువ పార్టీలకు ధనవంతులు అండ

**ఇంటింటికి సిపిఐ కార్యక్రమం లో పాల్గొన్న జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ**

శంషాబాద్, ఏప్రిల్ 07,(ప్రజా కలం)

పోరాటాల పార్టీకి ప్రజలు అండగా ఉన్నారు మోసాలు చేసే బూర్జువా పార్టీలకు ధనవంతులు అండగా ఉన్నారు . ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె నారాయణ అన్నారు. మంగళవారం నాడు సిపిఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి సిపిఐ కార్యక్రమం లో భాగంగా శంషాబాద్ మండల కేంద్రంలో బెంగళూరు హైవే పైన ఉన్న హోటల్ షాపులలో ప్రజలను కలిసి పార్టీ కరపత్రాలను పంచుతూ ప్రజలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఈ దేశంలో బూర్చువ పార్టీలైన బిజెపి కాంగ్రెస్ తెలుగు రాష్ట్రాలలో ఉన్న తెలుగుదేశం టిఆర్ఎస్ పార్టీలకు ధనవంతులు విరాళాలు ఇచ్చి వారికి సంబంధించిన నిర్ణయాలను అసెంబ్లీ పార్లమెంటులలో రూపొందించుకుంటారు

పోరాడే కమ్యూనిస్టు పార్టీ ప్రజలతో విరాళాలు సేకరించి ఆ ప్రజల సమస్యలపై పోరాటం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. భారత నేలపై సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు అవుతుందని అధికారంలో లేకపోయినా ప్రజల పక్షాన కార్మిక వర్గం పక్షాన నికార్సుగా నిలబడి పోరాడే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా ఇజ్రాయిల్ ఇరాన్ పై చేస్తున్న యుద్ధం వల్ల పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ సమస్యలు ఏర్పడతాయని దానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని చెప్పడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. విశ్వ గురువు అని చెప్పుకునే నరేంద్ర మోడీ



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏమి చెపితే వినే పరిస్థితి ఏర్పడిందని గతంలో ఏ ప్రధాని కూడా అమెరికాకు దాసోహం కాలేదు ట్రంప్ కు భయపడి లొంగిపోయిన నరేంద్ర మోడీ దేశ పరువు తీశాడని ఆయన విమర్శించారు భవిష్యత్తులో కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న విధానాల పైన తెలుగు రాష్ట్రాలలో ఇక్కడి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల పైన పెద్ద ఎత్తున కమ్యూనిస్టులు ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యుడు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి మండల కార్యదర్శి నర్రగిరి ఏఐటియుసి మండల కార్యదర్శి గిలక రాజు నరేష్ నాయక్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు నెలల పసికందు చనిపోయిన కుమ్మెర సంఘటన పై సిబిఐ విచారణ చేయాలి

**- ఖమ్మం జిల్లా వెలుగు మాట్ల బుధన్ భూమి బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలి**

**- బాణాల అజయ్ కుమార్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి.**

హైదరాబాద్,ఏప్రిల్ 07(ప్రజా కలం ప్రతినిధి)

నాగర్ కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో రజక దంపతులను గుడిలోకి ప్రవేశించకుండా ఆపి దౌర్జన్యం చేసిన సంఘటనలో పసిపిల్లలను కూడా చూడకుండా దౌర్జన్యం చేసిన సంఘటన పసిపిల్ల మరణించడం సభ్య సమాజానికి తలవంపు. ఈ ఘటనపై సిబిఐ విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వందలాది మంది భారీ ధర్నా నిర్వహించారనీ బిసి జాతీయ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి,మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాణాల అజయ్ కుమార్ తెలిపారు. డాక్టర్ అరుణ్ బాబు నేతృత్వంలో కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలె ను కలిసి ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారని తక్షణమే స్పందించిన కేంద్రమంత్రి నాగర్ కర్నూల్ ఎస్పీ కి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. కేంద్రమంత్రి చెప్పిన ఎస్పీ మాత్రం ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదని బాణాల అజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాణాల అజయ్ కుమార్ మాట్లాడుతూ కుమ్మెర సంఘటన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్య పరిష్కరించకుండా నిందితులను కాపాడుతుందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అగ్రకుల దొరల ప్రయోజనాలను కాపాడడానికి వత్తాసు పలుకుతున్నారని,రేవంత్ రెడ్డి హయంలో అగ్రకులాలు రెచ్చిపోతున్నారని బీసీలను అణిచివేయడానికి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి



నుండి బీసీలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయి. కుమ్మెర ఘటన కాక అదేవిధంగా ఖమ్మం జిల్లా వెలుగుబట్ల గ్రామంలో భూదాన్ భూములలో రాష్ట్ర ప్రభుత్వం 2014లో భూములు కేటాయించడం జరిగిందని, హైకోర్టు బాధితుల వైపు న్యాయం చేయాలని తీర్పుని ఇవ్వడం జరిగింది పేద ప్రజలకు ఇచ్చిన భూములపై చిత్తశుద్ధి లేని ఈ ప్రభుత్వం నిర్ధాశనంగా పేద ప్రజలను రోడ్డు వైపు రోడ్డు వైపుకు నెట్టువేసిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాల పైన సిబిఐకి అప్పజెప్పాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బాణాల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.



## అన్నాసాగర్ లో సమ్మక్క సారలమ్మ లకు ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డి ఏప్రిల్ 07 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండలంలోని అన్నసాగర్ గ్రామ శివారులో ఉన్న దక్షిణ మేడారం గా ప్రసిద్ధిగాంచిన సమ్మక్క సారలమ్మ లకు మంగళవారం స్థానిక సర్పంచ్ స్రవంతి సాయాగౌడ్ గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు వారు ఓడి బియ్యం సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క కళాబృందం సభ్యులు, మాజీ సర్పంచ్లు పెద్ద గొల్ల దుర్గయ్య నాగమ్మ, మాజీ ఎంపిటిసి పరువయ్య, యువకులు నరేష్, నాగరాజు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం...

ఎల్లారెడ్డి ఏప్రిల్ 07 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం స్థానిక ఏఎంసీ చైర్పర్సన్ మా రెడ్డి రజిత వెంకటరామిరెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో ప్రభాకర్, డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఈ



సందర్భంగా ఆమె మాట్లాడుతూ....కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం గ్రేడ్-1వరి ధాన్యానికి క్వింటాలు?కు రూ. 2,389, సాధారణ రకం వరికి క్వింటాలు రూ. 2,369కు కొనుగోలు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, వేగం కోసం ఫ్యాక్స్, ఇతర సంబంధిత సిబ్బందికి ప్రొక్యూర్మెంట్ యాప్ వినియోగించా లన్నారు. అనంతరం ఆర్డీవో ప్రభాకర్ మాట్లాడుతూ... రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చూడాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, తహశీల్దార్? ప్రేమ్ కుమార్, కౌన్సిలర్స్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సొసైటీ కార్యదర్శి విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 07:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండలం కొనసముందర్ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య,వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి



అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు.రైతులు పండించిన పంటలకు సరైన ధర అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మధ్యవర్తులు,దళారుల ద్వారా మక్కలను అమ్మకుండా రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 2,400కు మక్కలను విక్రయించుకోవాలని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జారం రాకేష్,ఉప సర్పంచ్ శంకర్,గ్రామ శాఖ అధ్యక్షుడు సామా మహేందర్,సీనియర్ నాయకులు జైడి శ్రీనివాస్,సామా భూమా రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు సామా ప్రతాపరెడ్డి,వ్యవసాయ అధికారి ఏ ఈ ఓ శ్యామ్,సీఈవో కార్తీక్ రైతులు పాల్గొన్నారు.

## గ్యార ప్రవీణ్ కు దళిత రత్న అవార్డు

మల్కాజిగిరి,ఏప్రిల్ 07(ప్రజా కలం ప్రతినిధి) మల్కాజిగిరి గౌతమ్ నగర్ డివిజన్ కు చెందిన దళిత కాంగ్రెస్ పార్టీ నాయకుడికి బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మల్కాజిగిరి చింతల్ బస్తీలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు కలెక్టర్,డీపీఎంసీ నెంబర్లు చేతుల మీదుగా దళిత రత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఈ అవార్డు నాకు మరిన్ని సేవలు చేయడానికి ప్రోత్సాహాన్ని అందించిందని చెప్పారు.



# ప్రజల ముంగిట 'విత్తన' సారథి

## రామన్నపేటలో అన్వేష్ రెడ్డి పల్లె నిద్ర
## వాడవాడలా తిరుగుతూ సమస్యల గుర్తింపు
## నాణ్యమైన TG సీడ్స్'నే వాడాలని రైతులకు పిలుపు



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 07:

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. 'ప్రజా పాలన -- ప్రగతి పాలన'లో భాగంగా మంగళవారం ఆయన రామన్నపేట గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం రాత్రి ఇక్కడే బస చేసిన ఆయన, మంగళవారం ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించి జనంతో మమేకమయ్యారు.

సమస్యల పల్లె 'బాట' :

ఉదయాన్నే గ్రామంలోని ప్రతి గల్లీలో పర్యటించిన చైర్మన్, స్థానికులతో నేరుగా ముచ్చటించారు. డ్రైనేజీ, తాగునీరు, రోడ్ల వంటి మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రజలు తమ గోడును ఆయన వద్ద వెళ్లబోసుకోగా.. వెంటనే స్పందించిన అన్వేష్ రెడ్డి, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

రైతే రాజు.. నాణ్యమైన విత్తనమే ఊపిరి:
ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ కీలక సూచనలు చేశారు:
నకిలీల పట్ల జాగ్రత్త: ప్రైవేట్ విత్తన కంపెనీలు చెప్పే ఆకర్షణీయమైన మాటలు నమ్మి మోసపోవద్దని రైతులను హెచ్చరించారు.
TG సీడ్స్పై భరోసా: ప్రభుత్వ రంగ సంస్థ అయిన తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ అందించే విత్తనాలనే వాడాలని, ఇవి పూర్తి నాణ్యతతో కూడుకున్నవని స్పష్టం చేశారు.
లక్ష్యం: రాష్ట్రంలోని ప్రతి రైతుకు తక్కువ ధరకే మేలైన విత్తనాలను అందించడమే తమ సంస్థ ప్రథమ ప్రాధాన్యతని తెలిపారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు మరియు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు గ్రామ సర్పంచ్ బేల్దారి నవీన్,ఉప సర్పంచ్ గోవర్ధన్ వీడీసీ సభ్యులు. కాంగ్రెస్ నాయకులు చిన్నయ్య, శోభన్ రెడ్డి, మోహన్,ఎలుక శ్రీనివాస్ గౌడ్ సుంకరి అశోక్,తెడ్డు బుమేశ్వర్,నితీష్ అక్లూర్ గ్రామ సర్పంచ్ జిన్నా జనార్దన్ మహిళా సంఘాలు పాల్గొన్నారు.



## ముదిమాణిక్యం లో మెడికవర్ హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం



చిగురుమామిడి, ఏప్రిల్ 07 (ప్రజా కలం ప్రతినిధి)

మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో మంగళవారం రోజున కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 200 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్, నాగరాజు జనరల్ ఫిజీషియన్,డిఎమ్ఓ సుస్మిత తెలిపారు.వీరికి అవసరమైన వారికి షుగర్, బీపీ,ఈసీజీ,కీళ్ల నొప్పులకు సంబంధించిన పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్,రఘు, మాట్లాడుతూ ముదిమాణిక్యం గ్రామ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో పండుగలు. సెలవులతో సంబంధం లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ బోయిని రమేష్, ఉప సర్పంచ్ పూదరి పర్షరాములు,వార్డు సభ్యులు పచ్చిమట్ల జగన్, పోతరాజు మునిందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముంజ ప్రకాష్ గౌడ్, గ్రామ ప్రజలు అంజిరెడ్డి,రాజిరెడ్డి. రాములు, మాధవరెడ్డి, మధుసూదన్, రాజు, శంకరయ్య,తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు

## -సత్వర న్యాయం అందించేందుకు పోలీసుల వినూత్న ప్రయోగం...




వలిగొండ ఏప్రిల్ 7 ప్రజాకలం:బాధితులు స్వయంగా పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయలేని ప్రత్యేక పరిస్థితుల్లో,వారి వద్దకే వెళ్లి న్యాయం అందించే దిశగా తెలంగాణ పోలీస్ శాఖ విధానానికి,వలిగొండ పోలీసులు మరోసారి సార్థకత చాటారు.ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా,వెంటనే స్పందించి సహాయం చేయడం పోలీస్ శాఖ బాధ్యత అని మరోసారి నిరూపితమైంది. పోలీస్ స్టేషన్కు వెళ్లలేని స్థితిలో ఉన్న బాధితుడి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన ఘటన వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది..మంగళవారం రోజున ఉదయం 11:00 గంటల సమయంలో మండలంలోని ఎం తుర్కపల్లి గ్రామానికి చెందిన ఉడుత నరసింహ అనే వ్యక్తి తనను అదే గ్రామానికి చెందిన మత్రి చంద్రయ్య అనే వ్యక్తి కర్రతో దాడి చేయగా,గాయపడిన అతను స్థానిక రేణుకా దేవి హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా,బాధితుడి సమాచారం అందించగా వెంటనే వలిగొండ ఎస్ఐ యుగేందర్ తన సిబ్బందితో, ఏఎస్ఐ జాఫర్,టెక్ టీమ్ కానిస్టేబుల్స్ అనిల్,శంకర్, మహిళ కానిస్టేబుల్ సింధుతో పాటు సంఘటన స్థలానికి స్వయంగా వెళ్లి,బాధితుడిని పరామర్శించి,అతని నుండి ఫిర్యాదును స్వీకరించారు.బాధితుడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని,న్యాయం ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో సంఘటన స్థలంలోనే ఆన్-సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి,కేసును బిఎంఎస్ చట్టం ప్రకారం నమోదు చేశారు. పోలీస్ స్టేషన్కు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నా కూడా, ప్రజలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని,ఈ ఘటన స్పష్టంగా తెలియజేస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు ప్రజల భద్రత కోసం,అవసరమైన సందర్భాల్లో పోలీసులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.




## అలై బలైయి ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ నెంబర్ పుట్టినరోజు వేడుకలు

మల్కాజిగిరి,ఏప్రిల్ 07(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి గాయత్రి నగర్ లో అలై బలైయి అసోసియేషన్ ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ నెంబర్ చెంత నాగరాజు పుట్టినరోజు వేడుకలను మంగళ వారం అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా సభ్యులు నాగరాజుతో కేక్ కట్ చేపించి వారికి శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, శంకర్ గౌడ్,హరి నారాయణ,అజయ్, విజయ్ శర్మ,నరేష్, అమర్నాథ్, రమేష్, సంగమేశ్వర్,జార్జ్, తదితరులు పాల్గొన్నారు.





## ప్రముఖ కవి నందిని సిద్ధారెడ్డి ని సన్మానించిన ఆర్టిఐ స్టేట్ సెక్రెటరీ లెగ్గేల రాజు

ఎల్లారెడ్డి ఏప్రిల్ 07 ప్రజా కలం ప్రతినిధి : ప్రముఖ తెలుగు కవి, తెలంగాణ రాష్ట్ర తొలి సాహిత్య అకాడమీ ఛైర్మెన్ నందిని సిద్దారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా మంగళవారం ఆర్టిఐ రాష్ట్ర కార్యదర్శి లెగ్గేల రాజు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. ఆయన ఇంకా ఎన్నో రచనలు చేసి మరిన్ని అవార్డులు అందుకోవాలని కోరారు.ఆయన వెంట ఆర్టి ఐ జిల్లా ప్రధాన సలహా దారులు దండుల లింగమయ్య, చందు ఉన్నారు...

## హాసకోత్తుర్ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 07:

మంగళవారం హాసకోత్తుర్ గ్రామంలో బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్న సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి కింద (జవీ=ఖీ) ఐదుగురికి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.



1) రాపర్తి నవ్య - 58,000/-
2) రాధారపు చిన్న సాయన్న -38,000/-
3) పడాల సత్యనారాయణ - 13,000/-
4) నలిమేలా పెద్దగంగాధర్ - 9500/-
5) ఎర్ర కిష్టయ్య - 9500/- లబ్ధి దారులు మాట్లాడుతూ మాకు కష్టకాలంలో సహాయ సహకారాలు అందించిన రేవంతన్న ప్రభుత్వానికి మరియు కృషి చేసిన సునీల్ అన్న గారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నలిమేలా రేవతి గంగారెడ్డి, ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్ పాలకవర్గ సభ్యులు కనక నర్సయ్య,పెద్ది సృజన్,కుందేటి శ్రీనివాస్ రాధరాపు గంగాధర్,కాంగ్రెస్ నాయకులు ఎడ్ల శ్రీకాంత్,గోపిడీ లింగారెడ్డి, మోదిని శ్రీధర్,మరియు లబ్దిదారులు ఉన్నారు.

## ఘనంగా పెయింటర్ సుమిత్ జన్మదిన వేడుకలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 07:

మోర్తాడ్ రవి ఆర్ట్స్ సంస్థలో పనిచేస్తున్న పెయింటర్ సుమిత్ జన్మదిన వేడుకలు ఎంతో ఘనంగా,ఆనందంగా నిర్వహించారు. సంస్థ




సభ్యులు సుమిత్ను తమ కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ప్రత్యేకంగా కేక్ ఏర్పాటు చేసి, అతని చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సహచరులు, నిర్వాహకులు సుమిత్కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంస్థ అభివృద్ధికి అతను అందిస్తున్న సేవలను ప్రశంసించారు.అతని కృషి, నిబద్ధత సంస్థకు ఎంతో మేలు చేసిందని పేర్కొన్నారు. తదనంతరం సుమిత్ను శాలువాతో ఘనంగా సత్కరించి, స్మారకంగా ఒక కానుకను అందజేశారు. ఈ వేడుకలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆనందంగా పాల్గొని, స్నేహపూర్వక వాతావరణంలో కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో శేఖర్, జావిద్,అన్వర్,దినకర్, ప్రభాస్, ప్రశాంత్, ఆబిడ్ తదితరులు పాల్గొని సుమిత్కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఐటీ హబ్ నడిబొడ్డున

# హైడ్రా ఆపరేషన్

### - కమిషనర్ ఏవీ రంగనాథ్ మార్క్ యాక్షన్!
### - రూ. 1200 కోట్ల విలువైన 8 ఎకరాల భూమి స్వాధీనం



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ప్రజాకలం ప్రతినిధి): ఐటీ కారిడార్‌లో హైడ్రా (HYDRAA) మరోసారి తన ప్రతాపం చూపింది. బడా నిర్మాణ సంస్థల గుప్పిట్లో ఉన్న భారీ ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలో మంగళవారం హైడ్రా అధికారులు మెరుపు దాడులు నిర్వహించి, సుమారు 8 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్ ధర ప్రకారం రూ. 1200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఖానామెట్ సర్వే నంబర్ 55లోని ఈ భూమి అసైన్డ్ ల్యాండ్ కావడంతో, రంగారెడ్డి కలెక్టర్ దీనిని ఇప్పటికే నిషేధిత జాబితా (Prohibited List)లో పెట్టారు. అయితే, మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ ఇది తమ భూమి అని వాదిస్తుండగా, వాసవి నిర్మాణ సంస్థ అక్కడ ఆర్‌సీసీ ప్లాంట్లు, కార్మికుల కోసం షెడ్లు నిర్మించి 4.20 ఎకరాలను ఆక్రమించింది. మరోవైపు, కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబిత కూడా మరో 4 ఎకరాల భూమిని తనదిగా చెప్పుకుంటూ బౌన్సర్లను కాపలా పెట్టింది. ఈ భూకబ్జాలపై ఫిర్యాదులు అందడంతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఇది ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నాక, మంగళవారం కూల్చివేతలు ప్రారంభించారు. అధికారుల దూకుడును చూసిన వాసవి సంస్థ తన ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించుకోగా, మిగిలిన అక్రమ షెడ్లను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. స్వాధీనం చేసుకున్న 8 ఎకరాల చుట్టూ అధికారులు వెంటనే ఫెన్సింగ్ వేసి, "ఇది ప్రభుత్వ భూమి" అని తెలిపే బోర్డులను ఏర్పాటు చేశారు. గతంలోనూ ఇదే సర్వే నంబర్ 55లో 11 ఎకరాలను, సర్వే నంబర్ 53లో మొండికుంట ఆక్రమణలను హైడ్రా తొలగించిన విషయం తెలిసిందే. బడా బాబుల బెదిరింపులకు వెరవకుండా ప్రభుత్వ భూములను కాపాడుతున్న కమిషనర్ రంగనాథ్ బృందాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.




## మళ్లీ అధికారంలోకి రావాలంటే..

# సైనికుల్లా పని చేయాలి



నాగర్ కర్నూల్, ఏప్రిల్ 7 (ప్రజాకలం) : తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్పకవనం అర్బన్ పార్కులో అగ్నిప్రమాదం

### మంటలను అదుపులో తీసుకువచ్చిన ఫైర్ సిబ్బంది మరియు అటవీ శాఖ అధికారులు




గజ్వేల్ :07 ఏప్రిల్ ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ లో సుమారు 300 ఎకరాలతో ఏర్పాటు చేయబడింది. కల్పకవనం అర్బన్ పార్కులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు పది ఎకరాలలో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడుతుండడంతో విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది, పోలీసుల సహాయంతో అటవీశాఖ అధికారులు ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ పవన్ కుమార్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగాపూర్ గ్రామ శివారులో గల కల్పకవనం అర్బన్ పార్క్ సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో ఉందని తెలిపారు. కల్పకవనం అర్బన్ పార్కులో మంటలు వ్యాపిస్తున్నాయని వెంకటేశం అనే రైతు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందికి పోలీసులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకొని సుమారు మూడు గంటల పాటు కష్టపడి ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చామని తెలిపారు. అగ్ని ప్రమాదం వల్ల పార్క్ లో ఉన్న జంతువులకు ఎలాంటి నష్టం జరగలేదని అన్నారు. గ్రామ ప్రజలు యువకులు అడవులలో ఎలాంటి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.








# రాష్ట్రస్థాయి ఉత్తమ గైనకాలజిస్ట్‌గా డాక్టర్ అన్నపూర్ణకు పురస్కారం

### -గజ్వేల్ ఆసుపత్రిలో రికార్డు స్థాయి ప్రసవాలు నిర్వహించినందుకు గౌరవం
### -వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అవార్డు ప్రదానం



గజ్వేల్: 07 ఏప్రిల్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే రాష్ట్రస్థాయి పురస్కారాలలో భాగంగా,గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు. డాక్టర్ అన్నపూర్ణ గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా సేవలు అందిస్తూ,రికార్డు స్థాయిలో అత్యధిక సంఖ్యలో ప్రసవాలు (డెలివరీలు) నిర్వహించినందుకు గాను ఉత్తమ గైనకాలజిస్ట్ గా ఎంపికయ్యారు. అలాగే సిద్దిపేట జిల్లాలో డి.సి.హెచ్.ఎస్ మెడికల్ సూపరింటెండెంట్‌గా ఆమె అందించిన అత్యుత్తమ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందించింది. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం కేవలం నా ఒక్కరి కృషి వల్ల సాధ్యం కాలేదని, ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు,నర్సింగ్ ఆఫీసర్స్,ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బంది,శానిటేషన్ సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు,సమిష్టి కృషి వల్లే ఈ గుర్తింపు లభించిందన్నారు. వారందరికీ ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రస్థాయి అవార్డు రావడం వల్ల తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. భవిష్యత్తులో మరింత కష్టపడి పనిచేస్తానని,సిద్దిపేట జిల్లాను వైద్య ఆరోగ్య రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.

# ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి-ఎమ్మెల్యే శ్రీగణేష్

### కన్నుల పండగలా తపస్య డిగ్రీ కళాశాల వార్షికోత్సవం




కంటోన్మెంట్: ఏప్రిల్ 7:ప్రజా కలం ప్రతినిధి చదువు పూర్తి చేసి ఉద్యోగాలు చేయడం కాదు, ఉపాధి కల్పించే స్థాయి కి ఎదుగాలని ఎమ్మెల్యే శ్రీ గణేష్ సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం క్లాసిక్ గార్డెన్స్ లో నిర్వహించిన తపస్య డిగ్రీ కళాశాల 3 వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపి, విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరవచ్చని, ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ప్రతి ఒక్కరూ చేరాలని, ప్రతి ఒక్కరూ తమకు ఇష్టమైన రంగంలోకి ప్రవేశించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com